# అనితర సాధ్యుడు!

బుచ్చిబాబు గేటుదగ్గిర్నించే "విమలా, విమలా! ...." అని అరుస్తూ లోపలికొచ్చాడు. పుస్తకాలు ఆఫీసు టేబుల్ మీద పడేసి మళ్ళీ "విమలా! విమలా! ...." అంటూ వంటింట్లోకి బైల్దేరాడు.

"అబ్బబ్బా! ఏవిటా అరుపులు మేకలాగ?"

"ఎక్కడున్నావ్?"

"ఇంకెక్కడ? ఇక్కడే! ఎక్కడికీ పోలేదు నిన్నొది లేసి."

"లోపలే వున్నావా! పలకవేం? ఏం చేస్తున్నావ్?"

"ఇంకేం చేస్తానూ? నీ సేవలో అరితేరుతున్నాను. అంతకన్నా ఏం ఉద్యోగం వుందీ?"

"చేద్దువుగాని ఉద్యోగం, ఆ చదువు పూర్తి చెయ్య రాదూ? బి.ఎల్. చేసేస్తే చక్కగా నువ్వు కూడా కోర్టుకి రావొచ్చు."

"నా కొద్దు బాబూ ఆ పాడుపనీ! చూస్తున్నాగా నిన్నూ, నీ కేసులూ, మీ కోర్టులూ, అలాంటి పని నా కక్కర్లేదు."

"చదువుకి ఒళ్ళొంగక ఎన్ని వంకలైనా పెడతావు."

విమల కళ్ళింతింత చేసింది — "నాకు ఒళ్ళు వంగదా? ఇవ్వాళ నాలుగు పుస్తకాలు చదివి రెండు గంటలు కష్టపడి కొత్త వంటకం చేశాను తెలుసా?"

"తెలీకేం? వంటలు చెయ్యమంటే నీ తర్వాతే! ఎందుకా వంటకాలూ పింటకాలూ? ఏ నవలన్నా చదువుకోరాదూ? పోనీ కథలు గిలుకుతావుగా? అవేవో రాసుకోరాదూ?"

"ఎన్ని రాశానో, ఎన్ని పత్రికలకి పంపానో! ఒక్క టన్నా వేస్తేనా? నా భావాలంటేనే హడలెత్తి ఛస్తారు వాళ్ళు."

"వాళ్ళకి ఎలా కావాలో అలాగే రాయరాదూ?"

"ఆఁ, రాస్తాను, సీతమ్మవారి సతీత్వాలూ, సావిత్రమ్మ వారి పాతివ్రత్యాలూ రాసి పంపుతాను. పాపం చదువుదువుగాని"

"సీతల్నీ సావిత్రుల్నీ వెక్కిరిస్తావుగానీ, నీకన్నా పెద్ద పతివ్రత ఎవరు? అందర్నీ మించిన పతివ్రతవే నువ్వు!" అని బుచ్చిబాబు వెటకారంగా నవ్వాడు.

విమల గాయపడి పోయినట్టు చూసింది — "అదన్నమాట నువ్వు నన్ను అర్థం చేసుకున్నది! సరేలే, నా మీద ఇంత అభాండం వేశాక ఇవ్వాళ వొండింది నీకు పెడతానేమో చూడు!"

"ఏం వొండావేమిటి?"

"ఆఁ, చెపుతాను రమ్మనీ. తెల్లగా వుంటుంది, చల్లగా వుంటుంది, మెత్తగా వుంటుంది, తియ్యగా వుంటుంది. ఎంత బాగానో కుదిరింది. అప్పలమ్మ రాగానే ఇద్దరం పళ్ళాల్లో పెట్టుకుని మెట్లమీద కూర్చుని తినేస్తాం. తర్వాత గిన్ని కడిగేస్తుంది."

"నాక్కూడా కొంచెం పెట్టరా?"

"వంట చేసినందుకు నన్ను 'పతివ్రత' అని తిట్టాక నేనెందుకు పెట్టాలీ?"

"అది తిట్టా? ఊరికే అలా అన్నానంతే."

"అదే, ఎందుకన్నావూ? నాకు ఇన్సల్టా కాదా?"

"తప్పేలే, నీ అంత యాంటీ పతివ్రత ఎవ్వరూ వుండరు. ఏం వొండావో చెప్పూ!"

"బట్టలు మార్చుకురా!"

"అబ్బా, ఏం వొండావో చెప్పడానికి బట్టలు మార్చుకోవాలా!"

"చెప్పడం ఏమిటి? ఏకంగా చూపిస్తాను, చేతు లన్నా కడుక్కురా!"

బుచ్చిబాబు వాకిట్లోకి పరిగెత్తి, చేతులు నీళ్ళల్లో ముంచి పరిగెత్తుకొచ్చాడు, తెల్లగా, చల్లగా, మెత్తగా, కమ్మగా వుండే వంటకాన్ని ఊహిస్తూ!

బల్లమీద పళ్ళెంలో తెల్లటి ముద్ద ప్రత్యక్షమైంది!

"ఏమిటిదీ? చలిమిడా?" అంటూ గచ్చ కాయంత వుండతీసి నోట్లో పడేసుకుని మాయం చేశాడు. "పంచదార చలిమిడీ! ఎంత బాగుందో! బెల్లంతో అయితే ఇంకా బాగుంటుంది విమలా! బెల్లం లేదా ఇంట్లో? నువ్వులు వెయ్యలేదేం ఇందులో?"

"గసగసాలు వేశాను చూడు. బియ్యం నానబెట్టి

నేనే పిండి కొట్టాను తెలుసా?"

"అబ్బా, అన్నీ బండ పనులే. రేపట్నించీ వొడ్లు కూడా దంచు! ఒక బస్తావొడ్లు కొని పడేసుకుందాం. రోజూ కాసిన్ని దంచుతూ కూర్చో! కేకలేసే వాళ్ళు లేక మరీ మతిపోతోంది నీకు."

"ఏం, నువ్వేస్తున్నావుగా కేకలూ?"

"కేకలా? వీటిని కేకలంటారా?"

"మరి యావంటారూ? .... ఇంతకీ నువ్వు తినవా చలిమిడీ?"

"అక్కర్లేదు. తీసెయ్!"

"ఎంగిలి చేసేశావు. అది నేనేం చెయ్యను?"

"పారెయ్! చీమలు తింటాయి."

"అమ్మో! అంత కోపమే! .... ఈసారికి తినెయ్యి బుచ్చిబాబూ! ఇంకెప్పుడూ ఇలాంటి బండ వంటలు చెయ్యన్లే."

"నా కక్కర్లేదన్నాగా? ఇన్ని మాటల్లేవు నాతో."

"నా తోటీ లేవులెద్దూ అన్ని మాటలూ. ఈసారి చెయ్యనన్నాగా? నిజంగా నా మీద నాకే కోపం వొచ్చింది బుచ్చిబాబూ, ఇందాక పిండిదంచుతోంటే. అబ్బా, ఎంత విరక్తి వొచ్చిందో! ఆ రోకలి బండతో నెత్తి మీద కొట్టేసుకుందాం అనిపించింది. చక్కగా రెండు నిమిషాల్లో ఉప్మా చేసేసుకోక ఇంతసేపా అని ఏడు పొచ్చేసింది. తీరా మొదలు పెట్టేశాను కదా అని ఎలాగో ఓపిక తెచ్చుకుని చేసేశాను. ఇలాంటి తిళ్ళు నీకు ఇష్టం కదా అని ...."

"అదుగో, అదే వొద్దంటాను. ఇలాంటివేంటి, అలాంటివేంటి, ఏది చేసుకుంటే అదే ఇష్టం. తేలిగ్గా అయిపోయేది చేసుకోవాలి. రోళ్ళూ రోకళ్ళూ తిరగళ్ళూ పెట్టి చెయ్యమన్నానా నేను?"

"నువ్వన్లేదనుకో. ఆమాత్రం చెయ్యలేనా అని మొదలుపెట్టా."

"పిల్లలుంటే వాళ్ళని నాలుగుబాదే దానివి. సమయానికి వాళ్ళూ లేరు. ఇక కోపం ఎవరి మీద తీర్చుకుంటావు? బండతో నీ నెత్తిమీదే కొట్టుకున్నా కొట్టుకుంటావు."

"అన్యాయం బుచ్చిబాబూ! పిల్లలుంటే వాళ్ళని కొడతానా? నువ్వంటే చెప్పలేనుగానీ ...."

"నన్నయితే ఫర్వాలేదనుకో ...."

"అదిగో, అటు చూడు! నా పుస్తకాలన్నీ టేబుల్ మీదపెట్టేసుకున్నాను. ఇందాక వంటింట్లో విరక్తి వొచ్చి నప్పుడు 'ఛీ, ఛస్తే ఈ సంసారం చెయ్యను, చదువు పూర్తి చేసేసి ఉద్యోగం చేసేసుకుంటాను" అని బైటికి పరిగెత్తుకొచ్చేసి నా పుస్తకాలన్నీ తీసేసుకున్నాను."

బుచ్చిబాబు ఎప్పుడో చలిమిడి ముద్ద మాయం చేసేశాడు — "పనంతా అయిందిగా? విరక్తి వుందా పోయిందా?"

విమల నవ్వుతూ "ఎలా కనిపెట్టావూ?" అని ఆశ్చర్యపోయింది.

"నీ తిక్క నాకు కొత్తా?"

"అదికాదు బుచ్చిబాబూ! ఆ పుస్తకాలు కాస్సేపు చూస్తే .... అబ్బా, ఏముందీ అందులో? ఆ రాజులూ .... పరిపాలనలూ .... చీదరపుట్టి వంటింట్లోకి పరిగెత్తు కొచ్చి పిండి జల్లించేసి, పాకం పట్టేసి, అందులో పిండి పోసేస్తే చలిమిడి అయిపోయింది! ప్రాణం లేచి వొచ్చింది."

"అయితే ఇంకేం? రోజూ పిండి దంచుతూ, పప్పు రుబ్బుతూ కూర్చో!"

"అదీ విసుగే బుచ్చిబాబూ! మరి తప్పదు కదా? వొండుకోవాలి కదా? బతకాలి కదా?"

"ఇప్పుడు చలిమిడి తినకపోతే బతకలేమా? ఉప్మా చేసుకుంటే చాలదా?"

"రోజూ ఉప్మాయేనా? ముప్ఫై రోజులూ ఉప్మా యేనా? తినబుద్ధేస్తుందా?"

"ఎందుకు బుద్ధెయ్యదూ? పిల్లలుంటే గోల పెడతారేమోగానీ .... అన్నట్టు పిల్లల దగ్గిర్నించేమన్నా ఉత్తరం వొచ్చిందా?"

"అయ్యయ్యో, మర్చేపోయాను. బుచ్చిబాబూ! నిర్మల రేపొద్దున్నే వొస్తోంది. అది అప్పుడే బియ్యేకి వొచ్చేసింది. సెలవలన్నాళ్ళు ఇక్కడే వుంటుందట! అబ్బా, నిర్మల వస్తోందంటే భలే సంతోషంగా వుంది బుచ్చిబాబూ నాకు! అది నా కన్నా పదేళ్ళు చిన్నదిగానీ దానికీ నాకూ బాగా స్నేహం!"

"నిర్మలెవరు?" బుచ్చిబాబు చలిమిడి పళ్ళెం మళ్ళీ నాకాడు.

"నిర్మలెవరా! నిర్మలనే మర్చిపోయావా? విశాల చెల్లెలు."

"విశాలెవరు?"

చేతిలో పుస్తకం బుచ్చిబాబు మొహానికి విసురు దామనుకుంది గానీ పుస్తకం చాలా మంచిదని కోపం ఆపుకుంది. "అసలు మా వాళ్ళందరి పేర్లూ, వరసలూ పెళ్ళికి ముందే కంఠతా పట్టించవల్సింది నీతో."

"ఇప్పుడేం మించిపోయింది? ఇప్పుడు పట్టించ రాదూ?"

"అయితే కంఠతా పట్టు.

నిర్మల విశాల చెల్లెలు విశాల నిర్మల అక్క. నిర్మల విశాల చెల్లెలు. విశాల నిర్మల అక్క .... వచ్చిందా?"

"ఆఁ, వచ్చింది."

"ఏదీ, అప్పచెప్పు!"

"నిర్మల నిర్మల అక్క.

విశాల విశాల చెల్లెలు.

నిర్మల నిర్మల ...."

పుస్తకం గిరాటుపెట్టి లేచిపోయింది విమల.

నిర్మల గురించి మాట్లాడాలని విమల ఉత్సాహంగా ప్రారంభిస్తే బుచ్చిబాబు సరిగ్గా పాఠం అప్పజెప్పక అల్లా చేశాడు.

విమల పిన తల్లి పిల్లలూ పెత్తల్లి పిల్లలూ, స్కూళ్ళకీ కాలేజీలకీ ఏమాత్రం సెలవులొచ్చినా, విమల ఇంటికి పరిగెత్తుకొస్తారు. విమల తరుపు బంధువులంటే, విమల తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ అంటే, వాళ్ళతో బుచ్చిబాబు చాలా స్నేహంగా, ఇష్టంగా, వుంటాడు. విమల ఇంట్లో వున్నన్ని రోజులూ వాళ్ళకి ఎంతో సరదాగా, ఆటవిడుపులాగా, గడుస్తుంది.

అనుకున్న రోజున, అనుకున్న వేళకి, నిర్మల వచ్చేసింది. బుచ్చిబాబే స్టేషన్‌కి వెళ్ళి తీసుకొచ్చాడు.

గేటుదాకా వచ్చాక నిర్మల బైటే దాక్కుంది.

బుచ్చిబాబు ఒక్కడే లోపలికొచ్చాడు — "నిర్మల రాలేదు విమలా! ట్రయినంతా చూశాను. ఎక్కడా కనపడలేదు" అంటూ.

"రాలేదా? వస్తున్నానని రాసిందే! ఎందుకు రాదూ? సరిగ్గా చూశావా? కళ్ళజోడు పెట్టుకున్నావా? జోడు లేకపోతే నీకు ట్రయిను కూడా కనపడదు" అని విమల కోపంగా ప్రశ్నలు కురిపించింది.

"అబ్బా! ప్లాట్‌ఫారం అంతా మూడుసార్లు ఇటూ అటూ తిరిగాను. ఎక్కడా కనపళ్ళేదు" అని మొత్తుకున్నాడు బుచ్చిబాబు.

"అయితే రాలేదా? ఎందుకు రాలేదబ్బా? ఈ మాత్రానికి 'వొచ్చేస్తున్నాన'ని రాసి యాడవడం ఎందుకూ?" అని రుసరుసలాడింది విమల.

"బొఁయ్!" అని అరిచింది నిర్మల వెనకనించి. పకపకా నవ్వడం మొదలెట్టింది.

"అబ్బా, జడుసుకుని చచ్చాను. వొచ్చేశావా అయితే? మీరిద్దరూ దొంగాటలా నాతో? అయితే నిజంగా వొచ్చేశావన్న మాట!" అని విమల చాలా సంతోషించింది.

"నిర్మల అచ్చు నీ అంత పొడుగైంది విమలా! నిర్మల్ని చూసి నువ్వు కూడా స్టేషన్‌కి వొచ్చేశావేమో అనుకున్నాను" అన్నాడు బుచ్చిబాబు ఆశ్చర్యపోతూ.

నిర్మల పకపకలాడుతూ "విమలా! అసలేమైందో తెలుసా? బావ నన్ను చూసి 'విమలా, నువ్వా వొచ్చావా? ఎప్పుడొచ్చావూ?' అని ఆశ్చర్యపోయాడే!" అని గోలగోలగా నవ్వుతూ చెప్పింది.

విమలకూడా నవ్వి "సరేలే, కబుర్లన్నీ తర్వాత. ముందు స్నానంచేసి రా! టిఫిన్ తిందువుగాని" అంది.

"ఏం చేశావేమిటి నా కోసం?"

"అప్పుడే చెప్పను. హఠాత్తుగా చూపిస్తాను."

"పోనీ, మొదటి అక్షరం చెప్పు. లేకపోతే చివరి అక్షరం చెప్పు!"

"ఇన్ని అక్షరాలు లేవు దానికి. ఉన్నది ఒకటే అక్షరం."

"అదేం టిఫినేవ్? ఒక్కక్షరం టిఫిన్ నేనెప్పుడూ తినలేదు. అయితే తొందరగా వొచ్చేస్తానే" అంటూ పరిగెత్తింది నిర్మల.

విమల కూని రాగాలు తీస్తూ బల్లమీద గిన్నెలూ ప్లేట్లూ సర్దడంలో పడింది.

నిర్మలకి పద్దెనిమిదేళ్ళుంటాయి. కాలేజీలో చదువుతోంది. విమల పోలికలే. విమలకన్నా ఎత్తు. చురుకైన కళ్ళు. విమలలాగే తెగ మాట్లాడుతుంది. విమలకీ తనకీ పదేళ్ళు తేడా వున్నా విమల్ని 'అక్కా' అనదు, పేరుతోటే పిలుస్తుంది. నిర్మలతో కబుర్లు చెప్పుకోడం విమలకి చాలా ఇష్టం!

"బుచ్చిబాబూ! ఒక్కక్షరం టిఫిన్ తిందువు గానిరా!" అని పిల్చింది విమల.

"వొస్తున్నాగానీ .... పాపం నిర్మల్ని చాలా ఆశ పెడుతున్నావు. కొత్త టిఫిన్ తినాలని సరదా పడు తోంది."

"కొత్తదో పాతదో ఒక్కక్షరం టిఫినని చెప్పాగా."

నిర్మల పరిగెత్తుకొచ్చింది, "ఏదీ ఒక్కక్షరం టిఫినూ? విమలా! ఏదే?"

"ప్లేట్లో వుంది. మూత తీసి చూడు!"

నిర్మల, ఒక ప్లేటుమీద మూత తీసింది. "హాఁ .... మోసం, మోసం! నేనొప్పుకోను. ఉప్మాచేసి ఒక్క క్షరం టిఫినంటావా? నన్ను మోసం చేశారు. నేనొప్పు కోను" అని గంతులేసింది.

"నిన్నేం మోసం చెయ్యలా, దాన్ని నేను 'ప్మా' అంటాను. కావాలంటే బుచ్చిబాబుని అడుగు."

"అవును నిర్మలా! అది 'ప్మా' యే" అని బుచ్చి బాబు సాక్ష్యం ఇచ్చాడు.

"నేనొప్పుకోను. మీరిద్దరూ తోడు దొంగలు. ప్మా — ఒక్కక్షరం కాదు. ద్విత్వాక్షరం."

"నీ మొహంలే. ప్మా — ద్విత్వాక్షరం కాదు, సంయుక్తాక్షరం. ఆ మాత్రం తెలిసి యాడవదన్న మాట నీకు!"

"నేనొప్పుకోను .... నన్ను మోసం చేశావు."

"సరదాకి అన్నాలేవే, అంతేడుస్తావేం?"

"తప్పయిందని వొప్పేసుకో!"

"సరేలే, తప్పయిందిలే. బోలెడు జీడిపప్పు వేశాను నీ ప్మాలో. చక్కగా తినెయ్యి!"

"ఒక్కక్షరం టిఫినేంటా అని ఎంత బుఱ్ఱ బద్దలు కొట్టుకుని చచ్చానో!" అంటూ నిర్మల ప్లేటు తీసు కుంది.

బుచ్చిబాబు తన తిండి అవగొట్టి "విమలా, కొంచెం పనుంది నాకు. మీరిద్దరూ మాట్లాడుకుంటూ వుండండి" అంటూ లేచాడు.

"అబ్బ, కూచోరాదూ? అస్తమానూ ఏం పనీ?" అని విసుక్కుంది విమల.

నిర్మల నవ్వుతూ "వెళ్ళు బావా! తొందరగా చేసు కుని వొచ్చెయ్యి, యేం?" అని బుచ్చిబాబుకి అను మతి ఇచ్చింది వెళ్ళడానికి.

"విమలా! ప్మా నిజంగా బాగుందే కమ్మగా."

"అందరి జీడిపప్పులూ నువ్వే మింగావు, బాగుం డదూ?"

"అబ్బా, ఇంత ఏడుస్తూ పెడితే, ఇక నాకేం అరిగి ఛస్తుంది?"

"ఏడిశావుగానీ, కబుర్లు చెప్పు! పిన్నీ వాళ్ళందరూ బాగున్నారా? బాబాయి బాగున్నాడా?"

"ఆఁ, అందరూ బాగానే వున్నారు. హాయిగా వున్నారు. నిక్షేపంలా వున్నారు."

"అదేవిటేవ్? వాళ్ళమీద రుసరుస లాడు తున్నావు, ఏమైందేవిటి?.... అన్నట్టు లలిత బాగుందా? వాళ్ళ పిల్లాడికి ఆరోగ్యంగా వుందా?"

"అబ్బా, అందరూ నిక్షేపంలా వున్నారు లేవే, తెగ చంపుతున్నావు .... అన్నట్టు విమలా, గుర్తొచ్చిందేవ్. శకుంతల లేదూ? అది ఇప్పుడు పుట్టింట్లోనే వుంటోంది. అత్తారింటి కెళ్ళడం లేదు."

"ఏం, ఎందుకూ?" అంది విమల ఆతృతగా.

"దాని గొలుసేదో వీళ్ళు తాకట్టు పెట్టుకుని విడి పించలేదట. పాపం వాళ్ళ నాన్నకి పక్షవాతం. ఎక్కడ లేని డబ్బూ ఖర్చవుతోంది. గొలుసు తెస్తేగానీ రావద్దంటున్నారట వాళ్ళు."

విమల, మొహం చిట్లించింది, "వెధవ గొలుసు ముఖ్యం అన్నమాట మనిషి కన్నా? మరి శకుంతలా వాళ్ళాయనేవంటున్నాడూ?"

"ఏవంటాడు? వాడే అసలు దొంగ. అస్తమానూ దానితో 'ఇంకెవర్నన్నా చేసుకుంటే బోలెడు కట్నం ఇచ్చేవారు' అంటాడట!"

"ఛీ, దరిద్రుడు! .... పోనీ, శకుంతల కొంచెం ధైర్యంగా వుందా?"

"ఉందిలే. కుట్టు సెంటర్‌కి వెళ్తోంది. ఇంకా ఏవేవో నేర్చుకుంటోంది .... అయ్యో విమలా! అసలు సంగతి మరిచేపోయానే! రాఘవరావు గుర్తున్నాడా నీకు? కొంగలా వుంటాడూ .... రెండో పెళ్ళి చేసు కున్నాడే!"

"అయ్యో, భార్యెప్పుడు పోయిందీ?"

"నీ మొహంలే, భార్య పోయాక కాదు, ఉండ గానే! 'నీకన్నా అందమైన పిల్ల దొరికితే వొదులుతానా' అన్నాట్ట భార్యతో!"

"ఆఁ, గుర్తొస్తోంది. తన అందానికి, పెళ్ళాం అందం చాలదనేవాడు, వాడా?"

"ఆఁ, వాడే!" ప్లేటు పట్టుకుని లేచింది నిర్మల.

"ఇంకా కొంచెం 'ప్మా' పెట్టనా?"

"ప్మా వొద్దు, ప్మీ వొద్దు"

"ఫీ తాగుతావా పోనీ?"

"ఫీ వొద్దు, గీ వొద్దు. 'లు' వున్నాయా?"

"లు? .... ఓహో పాలా? ఈ భాషే బాగుందే, తొందరగా మాట్లాడుకోవచ్చు."

విమల, పాలగ్లాసు బల్లమీదపెడుతూ అంది — "అందరి కబుర్లూ చెప్పావు, నీ కబుర్లేమిటి? ఆ మధ్య నీకేదో సంబంధం వచ్చిందన్నారు. చేసుకుంటున్నావా పెళ్ళి?"

"ఎంత పురాతనం ప్రశ్న వేశావే!"

"నువ్వు అధునాతనం జవాబు చెప్పరాదూ?"

"పెళ్ళా! నేనా! చేసుకుంటానా!!" అని నిర్మల మాట మాటనీ తల్చుకుని ఆశ్చర్యాలు పడిపోయింది.

"ఏం, చేసుకోవా?"

"నేనా? పెళ్ళా?"

"ఆఁ, నువ్వే! పెళ్ళే! నువ్వు గాకపోతే నేనా? చేసుకుంటావా లేదా?"

"చే .... సు .... కో .... నూ."

"ఎప్పుడూ చేసుకోవా?"

"ఎప్పుడూ చేసుకోను .... ఎప్పుడైనా అనివార్యమైన పరిస్థితులొచ్చిపడితే చేసుకుంటే చేసుకుంటానేమో!"

"అంటే? నెల తప్పినప్పుడా?"

"ఛీ ఛీ! ఛీ ఛీ! ఎంత బండ మనిషివే విమలా నువ్వు! అబ్బ! ఎంతమాటనేశావే! తల తిరిగిపోయే మాటనేశావే! అబ్బా!" అని నిర్మల తలకాయ ఝాడించేసింది.

"మరి, 'అనివార్య పరిస్థితు'లంటే ఏమిటో అంతకన్నా నాకేం తోచలేదు."

"తోచకపోతే నన్నడగాలి! అంతేగానీ నీ కిష్టమొచ్చిన అర్థాలు తీస్తావా?"

"సరేలే, ఇప్పుడు చెప్పు."

"ఆ జ్ఞానం ముందే వుండాలి."

"తప్పైందిలేవే. ఇంక చెప్పు."

"అనివార్య పరిస్థితులంటే .... నేను పెళ్ళి చేసుకోనని ఒక వెయ్యి సంవత్సరాలు ఉండిపోతాననుకో. అప్పుడు ఎవడైనా నాకు నచ్చిన చిన్న వాడు కనపడి, నా మనసు హరిస్తాడనుకో. అది, 'అనివార్య' పరిస్థితా, కాదా?"

"పిచ్చి మొద్దూ! అలాంటి దాన్ని 'అనివార్య పరిస్తితి' అనరే. సర్వప్రయత్నాలూ చేసి నివారించడానికి వీలుగాక పోతేనే దాన్ని అనివార్య పరిస్థితి అంటారు."

"నాకూ తెలుసేవ్! పెళ్ళి చేసుకోకూడదని వెయ్యేళ్ళపాటు నేను కూడా సర్వ ప్రయత్నాలూ చేస్తానుగా? అయినప్పటికీ ఆ ప్రేమ వాహినిని అరికట్టలేక దాంట్లోపడి ఉక్కిరిబిక్కిరై పోయినప్పుడే కదా పెళ్ళికి వొప్పుకునేది? అది, అనివార్య పరిస్థితా కాదా?"

"ఓహో, అదా? అలాంటి పరిస్థితి వెయ్యేళ్ళదాకా రాదా? నీ మనసుని హరించేవాడు వెయ్యేళ్ళ దాకా బైటికి రాడా?"

"రాకపోతే రాకపోవచ్చు, వొస్తే వారం రోజుల్లోనే రావొచ్చు! అసలు రెండ్రోజుల్లోనే రావొచ్చు. చెప్పలేం."

"రెండ్రోజుల్లోనా!" అని విమల కళ్ళింతింత చేసింది.

"అబ్బ! ఏదంటే అదే పట్టుకుంటావే నువ్వు! రెండ్రోజులంటే రెండ్రోజులేనా ఏవిటీ?"

"వెయ్యంటే వెయ్యీకాదు, రెండ్రోజులంటే రెండ్రోజులూ కాదు. బాగుంది నీ వాగుడు."

"అసలు మంచివాళ్ళు కనపట్టంలేదే విమలా! మా కాలేజీ అబ్బాయిల్తో రెండు మాటలు మాట్లాడాలంటేనే వొళ్ళు మండుతుంది. ఇక పెళ్ళేం చేసుకుంటాం?"

" 'చేసుకుంటాం' అనకు! నా పెళ్ళి అయిందిలే. నీ సంగతి మాట్టాడు!"

"నా సంగతేలెద్దూ, 'చేసుకుంటాం' అన్నంత మాత్రాన నీ పాతివ్రత్యం కల్తీ అయిపోయింది గావున్ను .... జన్మంతా చూసినా మంచివాడు దొరుకుతాడా అని బెంగ పట్టుకుందే విమలా నాకు. మొన్న వేసంకాలం శలవల్లో విశాలా వాళ్ళింటికి వెళ్ళాను కదా? శ్యామల రావుని చూస్తే, నా శంక, నూరురెట్లభివృద్ధి చెందిందే."

"అన్నట్టు విశాల ఎలా వుందే? అడగనేలేదు.

దాని సంగతులేం తెలీడంలేదే."

"అలాగే వుంది. ఒకటే పాతివ్రత్యం. కల్తీలేని పాతివ్రత్యం! అబ్బా!"

"సరే, ఇక చెప్పకు! ఏడవనియ్యి!"

"రాత్రి నేను రైల్లో వొస్తోంటే ఒకాయన పెళ్ళానికి ఎన్ని పదార్థాలు కొనిపెట్టాడే! ప్రతి స్టేషన్‌లోనూ ఆయన కొనడం, ఆవిడ తినడం! పాలకోవాలూ జీడిపప్పులూ బఠాణీలూ అరటిపళ్ళూ జాంకాయలూ, అబ్బ! ఎన్ని కొన్నాడో! అల్లాంటివాడు కావాలె విమలా నాకు."

"రైలు ప్రేమల్ని నమ్మకూడదే పిచ్చిమొద్దూ! రైళ్ళల్లోనూ, సినిమాల్లోనూ అలాగే కొంటారు. ఇంటి దగ్గర కూడు పెడతాడో లేదో! వాడు గాకపోతే వాడి తల్లీ."

"అంతే అంటావా?"

"'అంతే' అననుగానీ, ఆ కేసు వదిలెయ్యి! ఆ తిళ్ళన్నీ నువ్వు తినలేవు. గేదికి మేత పడేసినట్టు పెళ్ళానికి తిండి పడేస్తే సరిపోతుందనుకుంటున్నావేమిటి? 'నీకేం లోటు చేశాను? నీకేం తక్కువ చేశాను?' అంటూ వుంటాడు, తిండి పారేసి."

"అబ్బ! ఎలాగే విమలా వీళ్ళతో? నాకు తెలిసిన భర్తలందరి చిత్రపటాలూ, జీవిత చరిత్రలూ, చూశానే. ఎవ్వరి మీదా గౌరవం కలగలేదు. ఒకే ఒక్క మానవుడు నాకు మనసారా నచ్చాడే విమలా!"

"ఎవడు వాడు? ఎచటి వాడు?"

"ఇచటి వాడేనే ....!"

"ఇచటివాడా! ఇచటెచటివాడు?"

"బావేనే."

"ఎవరూ? బుచ్చిబాబా!" విమల మొహం వికసించింది.

"అవునే విమలా! బావలాంటి వాడే కావాలే."

"'లాంటి' వాడెందుకూ? బావనే చేసుకో అయితే."

"చేసుకోనా, నిజంగా చేసుకోనా? మరి నువ్వో?"

"నా సంగతి నీ కెందుకు? నేను చూసుకుంటాలే. నా గురించి నువ్వాలోచించక్కర్లేదు. నీ కంత నచ్చితే బుచ్చిబాబునే పెళ్ళి చేసుకో — కానీ నాకు బాగా తెలిసిన వ్యవహారం కాబట్టి ముందు జాగర్తకోసం చెపుతున్నాను. బుచ్చిబాబు విమలా ప్రియుడు! అనితర సాధ్యుడు! తెలుసా!"

"'అనితరసాధ్యుడం'టే?"

"ఇతరులకు సాధ్యపడని వాడు! విమలకు మాత్రమే సాధ్యుడు! విమలకు మాత్రమే వశ్యుడు! విమలకు మాత్రమే లభ్యుడు!"

"అహ్హహ్హహ్హ" అంటూ నిర్మల పెద్ద కంఠంతో నవ్వింది నాటకాల్లోలాగ.

"చంపేస్తాను, నవ్వు ఆపకపోతే!" అని విమల మీదిమీది కొచ్చింది.

నిర్మల టక్కున నవ్వు కట్టేసి నోటిమీద చెయ్యి అడ్డుపెట్టుకుని వేళ్ళసందుల్లోంచి "ప్రతి భర్తని గురించీ ప్రతీ భార్యా అలాగే అనుకుంటుందని నేనో నవల్లో చదివాను. ఇహిహిహి" అని మళ్ళీ నవ్వింది.

"అయితే బుచ్చిబాబు 'అనితరసాధ్యుడు' కాడంటావా!"

"సింగినాదంలే. నేను ప్రేమించానంటే చూడు, విమలా గిమలా ఎగిరిపోవాలి, 'విమల జపం' మానేసి, 'నిర్మల జపం' మొదలుపెట్టాలి .... అసలు నీ నాధుడికి ఏమేం కూరలు ఇష్టమో చెప్పు!"

"'కూరల' సంగతెందుకూ?"

"మొగాళ్ళకి కడుపులోంచి హృదయంలోకి దారి వుంటుందంటారే."

"కడుపులోంచీ, వీపులోంచీ దారులెందుకే? చక్కగా హృదయంలో దారే పట్టుకోరాదూ?"

"నీకెందుకు అదంతా? నాకు తెలుసులే, బావకి ఏం కూరలిష్టమో చెప్పు నువ్వు, దట్సాల్!"

"చింత చిగురు పప్పు ...."

"ఏడిసినట్టుంది. చింతచిగురెక్కడ తీసుకురాను!"

"దోసకాయ పచ్చడీ."

"బతికించావు. దోసకాయలున్నాయా ఇంట్లో?"

"ఏమిటి, ఈ పూటనించే ప్రారంభిస్తావా?"

"మరి ఆలస్యం ఎందుకూ? నేను వారం రోజుల్లో వెళ్ళిపోవాలి."

"వారం రోజుల్లోనే బుచ్చిబాబు ప్రేమ సాధించేసి వొప్పందం కుదిర్చేసుకుంటా వన్నమాట!"

"ఆఁ, దొరికావు, దొరికావు! ఇంకా ఎక్కువ రోజు

లైతే ఆ పని చెయ్యగలననే కదూ? అంతేనా, అంతేనా?"

"ఏడిశావ్‌లే. ఏదో మాటవరసకి అంటే...."

"మాట వరసలూ, పీట వరసలూ నాకు పనికి రావు. అంతేనా కాదా, చెప్పేయ్!"

"తప్పేనే! తొందర్లో అనేశాను. వారం రోజుల్లో కాదుగదా, వెయ్యి సంవత్సరాల్లో కూడా నువ్వాపని చెయ్యలేవు. నువ్వూ, బుచ్చిబాబూ వేరే వేరే జన్మలెత్తిం తర్వాత అలా జరుగుతుందేమో! అప్పుడు నేను జన్మెత్తకపోతే ...."

"అన్ని సంవత్సరాలు అక్కర్లేదుగానీ, వారం రోజులు టైమియ్యి! అసలు వారం రోజులెందుకు? నాలుగు రోజులు చాలు. .... మూడు రోజులే చాలని నా అభిప్రాయం అనుకో. ఎందుకైనా మంచిదని నాలుగు రోజులంటున్నాను. విమలా ప్రియుడు, నిర్మలా ప్రియుడైపోతాడు. అనితర సాధ్యుడు గినితర సాధ్యుడైపోతాడు. అప్పుడు నీకు మరి నా మీద కోపం రాకూడదమ్మాయ్!"

"అలాగేలే. అలా జరిగితే నువ్వు నాకు ఎంతో మేలు చేసిన దానివవుతావు! ఆ సహాయం చేసిపెట్టు!"

"ఓ, తప్పకుండా సహాయం చేసిపెడతానే విమలా! అసలు ఈ మొగాళ్ళని నమ్మకూడదని నేను మొన్న ఒక నవల్లో చదివాను. ఈ మొగాళ్ళూ ...."

"నోరు ముయ్యి! ఉపన్యాసం కట్టిపెట్టి నీ ప్రయత్నాలు నువ్వు ప్రారంభించు!"

"అదుగో, అప్పుడే కోపం వచ్చేస్తోంది నీకు."

"ఏడిశావ్‌లే .... ఇంక ఆ సంగతి వొదిలెయ్యి! అసలు నీ కోసం బుచ్చిబాబు రెండు సంబంధాలు చూసి వుంచాడు."

"రెండెందుకే!" అని తెల్లబోయింది నిర్మల.

"రొండేవిటి?" అంటూ వొచ్చాడు బుచ్చిబాబు. వొచ్చి వంటింటి గడపమీద బైఠాయించాడు.

"నిర్మలకోసం నువ్వు రెండు సంబంధాలు చూడలేదూ బుచ్చిబాబూ?" అని విమల నవ్వు కళ్ళతో చూసింది.

"ఆఁ, అవును నిర్మలా! ఒక్కణ్ణే పెళ్ళి చేసుకుంటే వాడు మంచివాడైనా చెడ్డవాడైనా, వాడి దగ్గరే పడి వుండాల కదా? 'రొండు' సంబంధాలు చేసుకున్నావనుకో! ఒకళ్ళ ఇంట్లో కొన్నాళ్ళుండి పుట్టింటికి వెళ్తానని చెప్పి ఇంకోళ్ళ ఇంటికి వెళ్ళాలి. అక్కడా అలాగే చెప్పి మళ్ళీ వీళ్ళ ఇంటికి రావాలి. ఎవళ్ళు మంచి వాళ్ళయితే వాళ్ళింట్లో వుండిపోవాలి. ఏమంటావ్? అందుకే రొండు సంబంధాలు చూశాను" అని నవ్వాడు.

నిర్మల కూడా నవ్వుతూ — "నువ్వస్తమానూ చిన్న పిల్లల కథలు చదువుతావు కదూ బావా? అందుకే రెండు సంబంధాలు చూశావు.

నాకా సంబంధాలేవీ వొద్దుబావా! నా మన సంతా...." అని ఆగి మళ్ళీ నవ్వింది!

"ఆఁ, బుచ్చిబాబూ! నిర్మల నిన్ను గాఢంగా ప్రేమిస్తోందట! నిన్నే పెళ్ళి చేసుకుంటుందట! మరి, నీ ఇష్టం" అని చెప్పేసి విమల తన బాధ్యత నిర్వహించింది.

"అవును బావా! విమల చెప్పింది నిజమే. నా ప్రేమని ఏం చేస్తావో! పాల ముంచుతావో నీట ముంచుతావో!" అని నిర్మల బేలచూపులు చూసింది.

"పిచ్చిమాటలు!" అని బుచ్చిబాబు మృదువుగా నవ్వాడు.

"పిచ్చి మాటలేవిటి? అలా ఎగరగొట్టేస్తే నేనొప్పుకోను. ఏం, విమల తప్ప ఎవ్వరూ నిన్ను ప్రేమించకూడదా? నీ మీద ప్రేమ కలిగితే ఏం చెయ్యాలి? మనసుని చంపేసుకోవాలా? ఈ చాదస్తాలు నా దగ్గర నడవ్వు తెలుసా?"

"విమల నా కోసం ఎన్ని త్యాగాలు చేసిందో నీకేం తెలుసు? ఒకసారి వాళ్ళమ్మ కారప్పూస వొండి ఇస్తానంటే కూడా వినకుండా అర్జంటుగా నన్ను చూడాలని బుద్ధిపుట్టి నా కోసం వొచ్చేసింది. అలాంటి త్యాగమయిని వొదిలి పెట్టమంటావా నిర్మలా?"

"అబ్బే, వొదలడం ఎందుకూ? ఇద్దరం వుంటాం."

"అమ్మో! 'ఇద్దరూ' వుంటారా! నన్ను కూడా వుండనిస్తారా?"

"ఎందుకు ఉండనివ్వం? ఏం విమలా, ఉండనిస్తాం కదే బావని కూడా?"

"నా సంగతి ఎత్తొద్దన్నానా! నేనేం చేస్తానో నీకనవసరం, నీసంగతి నువ్వు చెప్పుకో."

"అదుగో, నువ్వు బావని బెదరగొడుతున్నావు .... నేనొప్పుకోను."

"బెదరగొడితే బెదిరిపోయే వాడైతే, అదేం ప్రేమే?"

"అయితే సరే. నా స్వతంత్ర శక్తితో, నా ప్రేమ వ్యవహారం నేనే సాగిస్తాను."

బుచ్చిబాబు నవ్వుతూ — "ఏం పిచ్చిమాటలు నిర్మలా? మీ ఊరు కబుర్లేమన్నా చెప్పు? ఎలా సాగుతోంది నీ చదువు?" అని నిర్మలదారి మార్చబోయాడు.

"అడగాలా? దాని మొహం చూస్తే కనపడ్డంలా?" — విమల.

"అబ్బా, శెలవల్లో కూడా పాడు చదువు గోలెందుకు బావా? వొదిలెయ్యి! మన ప్రేమ సంగతి మాట్లాడు."

నిర్మల కవ్వింపులకు నవ్వుతూ బుచ్చిబాబు కాస్సేపు చిరునవ్వులతో కూర్చుని లేచి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం వంట నేనే చేస్తానని ప్రకటించింది నిర్మల.

"బతికించావు తల్లీ! ఈ పాడువంట ఈ జన్మానికి తప్పుతుందా లేదా అని చూస్తున్నాను. శెలవలు రాగానే పిల్లలు అమ్మ దగ్గరికి వెళ్ళిపోయాక మూడొంతులు చాకిరీ తప్పింది. ఈ మొగుడు చాకిరీ ఎప్పుడు తప్పుతుందా అని చూస్తున్నాను. శెలవులన్నాళ్ళూ నువ్వే చెయ్యి!"

"శెలవులన్నాళ్ళూ యేవిటి? తర్వాత నేనెక్కడికి పోతాను? వెళ్ళవలిసింది నువ్వే!"

"అప్పుడే ఎందుకే గొప్పలూ? మరి, నేను పోనా? హాయిగా స్నానంచేసి కూర్చుని పుస్తకం చదువుకుంటాను."

"ఆ, చదువుకో" అని నిర్మల దోసకాయలూ, కత్తిపీటా ముందేసుక్కూర్చుంది. ఏం చెయ్యాలో తెలీలేదు నిర్మలకి. వంటింటి ముక్కూ మొహం తెలీవు. "దోసకాయ పచ్చడి నాకు రాదే విమలా" అని బిక్కమొహం పెట్టింది విమలని వెనక్కిపిల్చి.

విమల స్నానానికి బైల్దేరుతూ — "నన్ను చెప్పమంటే చెపుతాను. చెప్పనా?" అంది.

"ఆ పచ్చట్లో నీ పోలికలుంటే?"

"అయితే మా పక్కింటి వాళ్ళ నడుగు."

"వాళ్ళ పోలికలుంటే?"

"ఏడిశావ్‌లే, వాళ్ళ పోలికలుంటే యేం? బుచ్చిబాబు వాళ్ళ పచ్చడెప్పుడన్నా తిన్నాడా?"

"తిన్లేదంటావా? సరిగ్గా గుర్తుతెచ్చుకో. వాళ్ళెప్పుడూ వాళ్ళ పచ్చడి మీకివ్వలేదా?...."

"వెధవ ప్రశ్నలూ, నువ్వూనూ. నే పోతున్నాను."

"ఒసే విమలా, విమలా! అయితే వాళ్ళని అడగమంటావా?"

"అడిగితే అడుగూ."

"మీ విమల్నే అడగరాదా — అని వాళ్ళంటే ....? వొద్దులే, నువ్వే చెప్పు. నీ పోలికలూ, జ్ఞాపకాలూ, నీ మధురస్మృతులూ రాకండా నేనో పని చేస్తాలే."

"ఉప్పెక్కువేస్తావు గావును. ఎంత రుచి లేకపోయినా తింటాడు గానీ, ఒక్క ఉప్పుగల్లు యెక్కువైందంటే పాపం చాలా ఇబ్బంది పడిపోతాడు బుచ్చిబాబు."

"ఆ మాత్రం తెలుసులే. ఎవరైతే మాత్రం ఉప్పెక్కువైతే తింటారేవిటి? సరేలే చెప్పు. పచ్చడి సూత్రం ఏవిటి? ధనియాలూ, మెంతులూ, మిరపకాయలూ ఏ నిష్పత్తిలో వెయ్యాలి?"

"ఒకటీ ఈస్టూ రెండూ ఈస్టూ మూడూ."

"సరిగ్గా చెప్పావా? చిన్నపిల్లని మోసం చెయ్యకూడదమ్మా!"

"అయితే నన్నడక్కు ఫో."

"నా ఇష్టం వచ్చినట్టు మారుస్తాలే. నిన్నెవడు నమ్మాడు? ఇక నువ్వెళ్ళు బైటికి" అని విమల్ని గెంటేసి వంటగది తలుపులు వేసేసుకుంది నిర్మల.

విమల స్నానంచేసి తల దువ్వుకుని పడగ్గదిలో చదువుకుంటూ కూర్చుంది. రెండు గంటలయ్యాక హఠాత్తుగా గుర్తొచ్చి 'దీని పచ్చడి మండా! ఇంకా రాదేం?' అనుకుంటూ వెళ్ళి వంటగదిలోకి తొంగి చూసింది.

నిర్మల అప్పుడే పచ్చడి గిన్నిలోకి తీసి రోలు కడుగుతోంది. తలుపుల మధ్య విమల మొహం చూసి "అయిపోయిందే, కొంచెం రుచి చూడు ఎలాగుందో" అని చెంచాడు దోసలేహ్యం తెచ్చి విమల చేతికి పామింది.

విమల కుతూహలంగా చేతిలో లేహ్యం నాకి, కళ్ళు తేలేసి, నోరు నొక్కుకుంటూ వాకిట్లోకి పరిగెత్తింది. చేదు పుట్ట! దోసకాయలు చేదు చూడలేదన్న మాట, పిచ్చిమొద్దు! చెక్కు తియ్యలేదు. ధనియాలో సోలెడూ, మిరియాలో సోలెడూ పోసేసి నట్టుంది. అన్నీ కలేసి రెండు గంటలు రుబ్బింది. ఈ ముద్ద తీసుకుపోయి బుచ్చిబాబుకి పెడుతుంది. గావును. పాపం ఎలా తింటాడో! .... ఏం తింటాడు? వాదిలేస్తాళ్ళే!"

"ఏవిటే, చెప్పకుండా పరిగెత్తావూ?" అని అరిచింది నిర్మల.

"బాగానే చేశావే! ఆశ్చర్యంగా వుంది! ఇలాంటి రుచి వొస్తుందనుకోలేదు నేనసలు."

"మరేవిటనుకున్నావ్? నేనే పని చేసినా అంతే. వంట కమ్మగా చెయ్యాలంటే పదేసేళ్ళు వంటింట్లో నానాలేవిటి? మా అమ్మని చూస్తే వొళ్ళుమంట నాకు. వంటింట్లోంచి వూడిరాదు ఎప్పుడూ" అని చిన్న ఉపన్యాసం ఇచ్చింది నిర్మల.

"రెండురోజులు వంటచేస్తే చాలు. నువ్వు మీ అమ్మని మించిపోతావే" అని విమల అభినందించింది.

"ఇంకా రెండ్రోజులెందుకే చాదస్తం! అన్నట్టు విమలా! పక్కింటి వాళ్ళకి కొంచెం పచ్చడి ఇద్దామా? సంతోషంగా తింటారు."

"సంతోషం అలా వుంచు, అసలు చాలా ఆశ్చర్యపోతారు."

"అయితే ఇద్దామే విమలా!"

"చాల్లే! బుచ్చిబాబుకి లేకండా చేస్తావా యేమిటి? రోటి పచ్చళ్ళంటే బుచ్చిబాబుకి చాలా ఇష్టం. ఇంకా మిగిలితే అప్పుడు చూద్దాంలే. నువ్వసలు వంటిల్లంతా సర్దెయ్యి!"

నిర్మల పొంగిపోయే ఉత్సాహంతో బుచ్చిబాబుకి స్పెషల్‌గా భోజనం వొడ్డిస్తానని వంటిల్లంతా నీట్‌గా సర్దింది.

రాత్రి భోజనాల ఏర్పాటు జరుగుతోంటే, బుచ్చిబాబు, "విమలా! నువ్వూ రా" అని విమల్ని పిలిచాడు.

"నా కాకల్లేదిప్పుడు. నేనూ నిర్మలా తర్వాత తింటాంలే. ముందు నువ్వు తినేసి వెళ్ళి నీ రాతపని చేసేసుకో. నేను ఉత్తరాలు రాసుకుంటున్నాలే" అని విమల కుర్చీ ఎక్కింది.

నిర్మల చిరు చిరు నవ్వులతో వడ్డించింది బుచ్చిబాబుకి. "నీకు చాలా ఇష్టమని నేనే చేశాను బావా ఈ పచ్చడి. నేనెప్పుడూ వంట చెయ్యలేదుగానీ, నేర్చుకోడం ఎంతసేపు మనసుపెట్టి చేస్తే? ఇష్టం వున్న వాళ్ళకోసం పచ్చడి చెయ్యాలంటే ...." అని ఏవిటేవిటో మాటలు గుమ్మరిస్తూ రెండు గరిట్ల దోసముద్ద వేసింది పళ్ళెంలో.

"దోసకాయ పచ్చడా! ముక్కలేవీ?"

"రుబ్బేశాను."

"దోసగింజలేవీ?"

"రుబ్బేశాను."

"ఈ నల్లగింజలేవిటీ?"

"అబ్బ, మిరియాల్లే. నువ్వసలు తినూ!"

"తింటా, తింటా! పచ్చళ్ళంటే నాకు బలే ఇష్టం!" బుచ్చిబాబు ఉత్సాహంగా అన్నం కలుపుకుని గుండ్రాయంత ముద్ద ఎత్తి నోట్లోకి పంపించాడు. కళ్ళు తేలేసి మొహం బిగించి నిర్మలకేసి చూశాడు.

పెద్ద మూలుగు రాబోయింది. ఆపుకున్నాడు. "మంచినీళ్ళు! .... మంచినీళ్ళు!"

"ఇవిగో, ఇక్కడే వున్నాయి. మంటగా వుందా బావా?"

"మంట కాదు, మంట కాదు...."

"మరేవిటి? కొత్త రుచిరాలా?"

"అవునౌను, కొత్త రుచే, కొత్త రుచే."

"నీ కోసం చేశాను బావా! అబ్బా, రెండు గంటలు రుబ్బాను. బాగుంది కదూ?"

బుచ్చిబాబు ఆ గుండ్రాయిని శివుడు గరళం మింగినట్టు లోపలికి మాయం చేసేశాడు. "బాగుందమ్మా! చాలా బాగుంది."

"'అమ్మా' ఏవిటి? 'నిర్మలా' అను లేకపోతే 'నీరూ' అను, లేకపోతే 'నీలా' అను. మా కాలేజీలో ఒకబ్బాయి నన్ను .... ఆఁ, లేదులే. లేదులే .... పచ్చడి బాగుంది కదూ?"

"చాలా బాగుంది."

"రేపు చింత చిగురు పప్పొండుతా .... కాదు, కాదు .... చింతచిగురు కాదు .... ఆc, టమాటా .... టమాటా పప్పొండుతా, ఏం? నీ కిష్టమే కదూ?"

"నీకెందుకు శ్రమ? చిన్నదానివి. ఏవన్నా నవలలు చదువుకో. విమల చూసుకుంటుందిలే. పోనీ విమలకి సాయం చెయ్యి. ఆc, అలా చెయ్యి!"

"నేను చిన్నదాన్నా? విమల నాకన్నా ఎంత పెద్దదేం మహా? ఆరేళ్ళేగా?"

"ఆరేళ్ళా? విమలకన్నా నువ్వు పదేళ్ళు చిన్న దానివి."

"అయితే అయిందిలే. నీకోసం వండాలంటే నాకేం కష్టంలేదు. కావాలంటే నా ప్రాణాలు కూడా ఇచ్చేస్తాను నీకు."

బుచ్చిబాబు నవ్వాడు—"ప్రాణాలిచ్చేస్తే నువ్వింక వుండవు."

"ప్రాణాలిచ్చెయ్యడం అంటే అచ్చంగా కాదు బావా! నేను బతికే వుంటానుగానీ నా ప్రాణాలు నీవన్నమాట!"

బుచ్చిబాబు, కలుపుకున్న వాయంతా కిక్కురు మనకుండా మాయం చేసేశాడు.

"పచ్చడి మళ్ళీ వెయ్యనా బావా?"

"వొద్దొద్దు. మళ్ళీ రేపు వేసుకుంటాలే. నువ్వలా కూర్చో. నేను పెట్టుకుంటాలే" అని బుచ్చిబాబు అన్నం పెట్టుకుని పులుసు గరిటి తీసుకున్నాడు చేతిలోకి.

నిర్మల కోపంగా గరిటి లాగేసి "ఇది విమల" పొద్దున్న చేసిన పులుసులే. దీని మొహం! ఏడిసి నట్టుంది" అంటూ తనే పులుసు వొడ్డించింది.

పులుసన్నం తింటోంటే బుచ్చిబాబు మొహంలోకి ప్రశాంతత వొచ్చింది. సంతోషంగా భోజనం ముగించి లేచాడు.

గదిలోకి రాగానే విమల బుచ్చిబాబు మొహం కుతూహలంగా పరికించింది.

బుచ్చిబాబు విమల చెవిలో గుసగుసలాడాడు. "దోసకాయ పచ్చడి చాలా చేదుగా వుంది విమలా! పాపం మీరెలా తింటారు? తినలేరు. పారెయ్యండి! అన్నాల్లో కలుపుకోవొద్దు."

విమల నవ్వుతూ "చెప్పావా నిర్మలకి?" అంది.

"చెప్పలేదు. నువ్వు చెప్పు నెమ్మదిగా!"

"చెప్పలేదా! మరి నువ్వు పచ్చడి వొదిలేస్తే యేమంది?"

"వదల్లేదుగా? తినేశాను."

"అమ్మో! అంత చేదుపుట్ట తినేశావా?"

"మరేం చెయ్యను? 'బాగుందా, బాగుందా' అని పట్టుకుంది. ఇంకేం చెయ్యను? సరదాపడి చేసింది. పాపం ఏమనుకుంటుంది వదిలేస్తే?"

"అందుకనీ అంత చేదు పుట్ట తిన్నావా? అబ్బా! ఏం మనిషివి!"

"విమలా! అన్నాలు పెట్టేశాను రావే" అని కేక పెట్టింది నిర్మల వంటింట్లోంచి.

విమల వంటింట్లోకి వచ్చి పళ్ళాలచుట్టూ పొందిగ్గా సర్దిన గిన్నెలు చూసి "బుచ్చిబాబుకి సేవలు చెయ్యాలి గానీ, నాక్కూడా ఎందుకే?" అని పీటమీద కూర్చుంది.

"నీక్కూడా సేవచేస్తే బావకి నా మీద ప్రేమ వచ్చి నన్ను పెళ్ళి చేసుకోడూ?"

"ఆ సంగతి మీరూ మీరూ చూసుకోండి బాబూ" అంటూ విమల నవ్వాపుకుంటూ పచ్చడి కలుపుకో కుండా ఇదీ అదీ సర్దుతూ తాత్సారం చేసింది.

నిర్మల పచ్చడిముద్ద నోట్లో పెట్టుకుందో లేదో నోట్లో తేలు కుట్టినట్టు కెవ్వున అరిచి వాకిట్లోకి పరి గెత్తింది. "ఇదేవిటే! ఇలాగుందేవిటే? ఏక్, ఏక్, అబ్బా ఎంత చేదో!"

విమల పీట మీదనించి లేచిపోయి పడీపడీ నవ్వడం మొదలు పెట్టింది. "కొత్త రుచే! కొత్త రుచీ!"

నిర్మల కోపంగా బుచ్చిబాబు దగ్గరికి పరిగెత్తి — "ఏంటి బావా, మాటవరస కన్నా అనలేదేం? దోసకాయపచ్చడి చేదుగా లేదూ?" అని అరిచింది.

"చేదా? నాకేం చేదుగా లేదే!"

"మంచివాడివే. చేదుపుట్ట లాగుంటే చేదులేదా నీకు? ఏం నోరు బాబూ నీది? నాలిక పీకేసుకోవాలని పిస్తోంది. అన్ని ముద్దలు ఎలా మింగావు? బాగానే వుంది నీతో!"

"పోనీలే నిర్మలా, మీరు తినొద్దులే, పారె య్యండి!"

"అది నువ్వు చెప్పాలా? భలేవాడివి" అని గిర్రున వెనక్కి తిరిగి రయ్యిన వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"భలే అయిందిలే అమ్మాయి గారికి" అని విమల మళ్ళీ గట్టిగా నవ్వింది.

నిర్మల పీటమీద కూర్చుంటూ "బావ ఏమిటే! అంత బండతనం?" అని విసుక్కుంది.

"బండత్వమా! మళ్ళీ అను! పళ్ళు రాలగొడతాను. నువ్వెంతో సరదా పడిచేశావని పాపం అతను అంత వోర్చుకుని తింటే, అది బండతనం లాగ కనపడిందా నీకు? 'అంత చేదుపుట్ట ఎలా తిన్నాడో' అని జాలన్నా లేదుగాని బండతనం గిండతనం అని పేర్లెడతావా? దోసకాయలు చేదు చూడాలని తెలీదటే దున్నపోతా? బండతనం యెవరిదే గాడిదా?"

"అఁ, నాకూ తెలుసులే! అసలు బావని పరీక్షిద్దామని అలా చేశాను తెలుసా? పెళ్ళి చేసుకునే ముందు పరీక్షించి చూసుకోవాలా వద్దా?"

"ఏడిశావులే, బాగా అయిందిగా ప .... రీ .... క్ష! ఆదిలోనే హంసపాదన్నట్టు, ఆరంభంలోనే గరళం పచ్చడి పెట్టావు. మహా చక్కగా ప్రే .... మి .... స్తాళ్ళే నిన్ను."

"అదుగో! దొరికావు, దొరికావు. వంట బాగా చేసి పెడితే ప్రేమిస్తాడు, లేకపోతే ప్రేమించడు. అంతేగా నీ సిద్ధాంతం? ఇందాక వంట బాగా చేసి ప్రేమ సంపాయిస్తానంటే నన్ను తప్పు పట్టావేం?"

"ఏడిశావ్లే, వెధవ పాయింట్లు తీస్తావు."

"తప్పొప్పేసుకో" అంటూ నిర్మల పచ్చడిగిన్ని వాకిట్లోకి గిరాటు పెట్టింది.

"పక్కింటివాళ్ళకి పెడతానన్నావుగా?"

"అమ్మో! వాళ్ళు తన్నడానికొస్తారు."

★ ★ ★

రెండోరోజు సాయంత్రం బుచ్చిబాబు ఇంటికి వొచ్చేసరికి విమల లేదు. నిర్మల ఒక్కతీ పడగ్గదిలో కూర్చుని చదువుకుంటోంది. విమల చీర కట్టుకున్న తనని చూసి బావ ఏమంటాడోనని ముసిముసి నవ్వులతో ఎదురు చూస్తోంది. విమల బైటికి వెళ్ళాకే నిర్మల ఆ చీర చుట్టబెట్టుకుంది.

బుచ్చిబాబు నిర్మలని విమలే అనుకుని "విమలా" అంటూ బాగా దగ్గరికి వొచ్చి హఠాత్తుగా ఆగిపోయాడు. "నువ్వా నిర్మలా? విమలనుకున్నాను. విమలేదీ? ఎక్కడికి వెళ్ళింది? నువ్వెళ్ళలేదేం? ఏదీ విమల? ఎప్పుడొస్తానంది?" అని నూటపదహారు ప్రశ్నలు వేశాడు.

"ఎక్కడికో వెళ్ళిందిలే. లైబ్రరీకి కాబోలు. నన్ను రమ్మందిగానీ నేను రానన్నాను. నీ కోసమే వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. నన్ను చూసి విమలని ఎందుకనుకున్నావో చెప్పు!"

"విమల చీర కట్టుకున్నావుగా?"

"అమ్మో! నీకు ఏ చీర ఎవరిదో కూడా తెలుస్తుందే! మరి ఈ చీర కట్టుకుంటే నేను బాగున్నానా? విమల బాగుంటుందా? నిజం చెప్పాలి."

"నీకు నువ్వా బాగున్నావు, విమలకి విమలా బాగుంటుంది."

"అలాగ దాటేస్తే నే నొప్పుకోను. ఎవరు అందంగా వున్నారో చెప్పాలి. నేను చిన్నప్పటి విమలలాగా లేనూ? నా పోలికలన్నీ విమల పోలికలే నంటారు మా వాళ్ళు. మీ పెళ్ళప్పటికి విమల ఎలా వుండేదో సరిగ్గా అలాగ లేనూ నేను?"

బుచ్చిబాబు నవ్వి కొంచెం ఆలోచించాడు — "ఏమో నిర్మలా! గుర్తు రావడం లేదు. పెళ్ళప్పటి విమల్ని మరిచేపోయాను నేను. ఆలోచిస్తోంటే పొద్దున్న చూసిన విమలే గుర్తొస్తోంది."

"ఎప్పటిదప్పుడే పరగడుపన్నమాట నీకు."

"లేకపోతే కళ్ళముందు సంగతులు వొదిలేసి పదేళ్ళో, పదిహేనేళ్ళో వెనక్కిపోయి అవి తల్చుకుని సంతోషిస్తూ కూర్చుంటామా నిర్మలా? అప్పుడు అదీ బాగుంది, ఇప్పుడు ఇదీ బాగుంది."

"నేన్నమ్మన్లే. అబద్ధాలాడుతున్నావు. విమల చిన్నప్పటి విమల్లాగే వుంటే నీకు సంతోషం కాదేమిటి?"

"నేను ఇప్పుడు చిన్నప్పటి బుచ్చిబాబునా? నేను పెద్దవాణ్ణయితే విమల కూడా పెద్దది అవదూ? చిన్నప్పటి విమలేవిటి, పెద్దప్పటి విమలేవిటి? ఆ విమలే ఈ విమల .... ఇంతకీ ఎక్కడి కెళ్ళింది విమల? ఎప్పుడొస్తానంది?"

"ఏమో బాబూ! నేను నిద్రపోతోంటే నన్నొదిలేసి పోయింది. కాస్సేపు విమల సంగతి వొదిలేద్దూ? నన్నే విమల అనుకో! నన్ను చూడు, నేను చిన్నప్పటి విమల లాగే వున్నాను. నా చేతులు చూడు, తెల్లగా పొడుగ్గా ఎంత బాగున్నాయో! నా కళ్ళు చూడు పద్మాల్లాంటి కళ్ళుకాదూ? సంపెంగలాంటి ముక్కు! .... ఇంకానేమో .... ఆఁ, నా జడ చూడు, జడ చూడు, ఎంత బాగుందో!"

"చాలా బాగుందిలేగానీ, కాఫీ పెట్టుకు తాగుదాం పద. నేను పెట్టిన కాఫీ నువ్వెప్పుడూ తాగలేదుగా? నువ్వలా కూర్చో! నేనే కాఫీ కాస్తాను."

"ఇదిగో, ఇక్కడే పెట్టాను ఫ్లాస్కులో. చూశావా? ఎంత శ్రద్ధగా పెట్టానో నీ కోసం? విమలైతే పదిసార్లు పిలిస్తేగానీ కాఫీ ఇవ్వదు."

"విమల ఎప్పుడూ ఏవో పనుల్లో వుంటుంది నిర్మల!"

"ఆఁ, నువ్వలాగే దాన్ని వెనకేసుకొస్తావులే" అంటూ నిర్మల, గ్లాసులో కాఫీపోసి ఇచ్చింది. "చూడు, ఎంత బాగా చేశానో! మంచిదాన్ని కదూ?"

"అవును, చాలా మంచి దానివి" అంటూ బుచ్చి బాబు నవ్వుతూ గ్లాసు అందుకున్నాడు.

"విమలకన్నా మంచిదాన్నేనా?"

"విమలతో ఎందుకు పోల్చుకుంటావు? విమలకి విమలా మంచిదే, నీకు నువ్వూ మంచిదానివే."

"అంతేనేవిటి? 'మంచిదానివి' అంటే సరిపోతుం దేవిటి! 'నువ్వు నాకు చాలా నచ్చావు' అను."

"నచ్చడం అంటే?"

"నచ్చడం అంటే .... ఊఁ .... నచ్చడం అంటే .... ముద్దురావడం. నేను ముద్దొస్తున్నానా నీకు? నా మొహం .... ముద్దొస్తోం .... మొహం కాదులే, మొహం కాదులే. నా చెయ్యి .... నా చెయ్యి ముద్దు పెట్టుకో మరి. అదీ నచ్చడం."

"పిచ్చిపిల్లా! ఊరుకో. నువ్వు కూడా కాఫీ తాగు, తర్వాత మాట్లాడుకుందాం."

"అదుగో, నన్నలా తీసేస్తే నేనొప్పుకోను. నేనేం చిన్నపిల్లననుకున్నావా? విమల నా కన్నా ఎంత పెద్దదేం మహా, ఐదేళ్ళేగా?"

"దొంగవి నువ్వు. ఇందాక ఆరేళ్ళన్నావు. ఇప్పుడు ఐదేళ్ళంటున్నావు."

"సరేలే. ఆరేళ్ళేలే."

"ఆరేళ్ళు లేదు, ఐదేళ్ళు లేదుగానీ విమల అన్నం వొండేసి వెళ్ళిందా? మనల్ని వొండమని చెప్పిందా?"

"మనల్నిద్దర్నీ చక్కగా యేదన్నా సినిమాకి వెళ్ళ మని మరీ మరీ చెప్పింది."

"అబద్ధాల పుట్టవి నువ్వు. విమలకి అసలు సినిమాలంటే వొళ్ళుమంట."

"విమలకి వొళ్ళు మంటయితే గంగలో దూక మను! నిన్ను నాతో సినిమాకి రమ్మంటాననుకో, వస్తావా రావా? 'ప్రేమ పిట్టలు' చాలా బాగుందట!"

"రేపు అందరం కలిసి వెళ్దాంలే, యేం?"

"రేపొద్దు, ఇప్పుడే! మనిద్దరం సినిమాకి పోతున్నా మని ఒక చీటీ రాసిపెట్టేసి వెళ్ళిపోదాం. పాపం విమల అది చూసుకుని బలే ఉడుక్కుంటుందిలే."

"అది సరేగాని, బియ్యే అయ్యాక ఏం చేస్తావు?"

"గంతులేస్తాను. తెలిసిందా?"

"ఓహో! డాన్స్ నేర్చుకుంటావా?"

"మాట తప్పించేస్తున్నావు. సినిమాకి వొస్తావా, రావా?"

"నిన్ను దెబ్బలు కొడతాను నిర్మలా! నాకు చాలా కోపం తెప్పిస్తున్నావు. పోనీకదా పాపం చిన్న పిల్లవి అని వూరుకుంటూంటే నీ అల్లరెక్కువై పోతోంది" అని బుచ్చిబాబు నవ్వులో కోపం ప్రదర్శించాడు.

నిర్మల ఇక లాభం లేదని నవ్వేసింది. "అదికాదు బావా! విమలా, నేనూ పందెం వేసుకున్నాం. విమల నిన్ను 'అనితర సాధ్యు'డంది. అప్పుడు నేనేమో ...."

"ఏదో కోపంలో తిట్టేసి వుంటుందిలే. విమల తిట్లు అంతపట్టించుకోకూడదు."

"అయ్యో, అది తిట్టు కాదు బావా! గొప్ప పొగడ్త! అనితర సాధ్యుడంటే విమలకి తప్ప ఇతరులకు సాధ్య పడని వాడట! అప్పుడు నేనన్నానూ బుచ్చిబాబుని నిర్మలా ప్రియుణ్ణి చేసేస్తానన్నాను. ఊరికే సరదాకి అన్నాలే. నాకు తెలీదేవిటి నువ్వెంత మంచివాడివో! విమల్ని ఏడిపిద్దాం బావా! ఒక్కసారి నువ్వు నన్ను విమల ముందు — 'నిర్మలా! నువ్వెంత అందంగా

వున్నావో! నిన్ను పెళ్ళి చేసుకుంటా' అను. ఏం? ఊరికే. సరదాకే. నిజంగా కాదు. వొట్టు! తర్వాత చెప్పేద్దాం. ఒక్కసారి విమల్ని ఏడిపించి ...."

"ఛీ, ఊరుకో!" అని మొహం చిట్లించాడు బుచ్చిబాబు. అంతలోనే కొంచెం నవ్వు తెచ్చుకుని — "ఏం ఆటలు చెప్పు, పిచ్చి ఆటలు! ... నీకేం ఊసి పోడం లేదా? పాపం నిన్నొక్కదాన్నీ వొదిలేసి ఎందుకు వెళ్ళింది? పోనీ కాసేపు వైకుంఠపాళీ ఆడుకుందాం రా, విమల వొచ్చేదాకా — గవ్వల డబ్బా తీసుకొస్తా నుండు" అని నిర్మల్ని అనునయించబోయాడు.

"అదికాదు బావా! ఊరికే సరదాకేగా? ఒక్కసారి సరదాకి అలా అంటే ఏం పోతుందమ్మా మరీనూ!"

"ఏం సరదా అది? చదువుకుంటున్నావు. ఎన్నో విషయాలు తెలివిగా మాట్లాడతావు. బావలకీ, మర దళ్ళకీ సరసాలుండాలేవిటి? పెళ్ళాన్నొదిలేస్తాననడం, మరదళ్ళని చేసుకుంటా ననడం... ఏం సరసాలవి? చీదరకాదూ? నా నోటికి రావు నిర్మలా అలాంటి మాటలు. సరదాకైనా సరే, నాకది అసహ్యం. బావ లెవరైనా అలాంటి మోటు వేళాకోళాలు ఆడితే నువ్వ సలు ఒప్పుకోకూడదు. అసలు విమలకి మతి లేదు. అస్తమానూ పిచ్చి పందేలు వేస్తుంది."

బుచ్చిబాబు మాటలు నిర్మల్ని ముగ్ధురాల్ని చేశాయి. బుచ్చిబాబు మంచివాడని తెలుసుగానీ, నిజంగా ఇంత మంచివాడని తెలీదు నిర్మలకి.

"అదికాదు బావా! మొన్న సెలవుల్లో మా అక్కా వాళ్ళింటికి వెళ్ళాను కదా? శ్యామలరావు అస్తమానూ 'నిన్ను పెళ్ళి చేసుకుంటా, నిన్ను పెళ్ళి చేసుకుంటా' అనేవాడు. నేను గట్టిగానే చెప్పాలే. ఆ మాట నీతో ఒక్కసారన్నా అనిపించలేనా అనుకున్నాను. ఊరికే, సర్దాకీ అలా అనుకున్నా. నువ్వు నిజంగానే అనితర సాధ్యుడివి బావా!"

"ఛ, ఊరుకో, ఏం పొగడ్తలవీ?"

"పొగడ్త కాదు బావా! నిజమే. కానీ..." నిర్మల విచారంలో మునిగిపోయింది. "విమల్ని ఒక్కసారన్నా ఓడించలేకపోయాను.."

"అదేం ఆట? పిచ్చాట! ఇంకేదన్నా ఆడుకోండి. వైకుంఠపాళీలో పదిసార్లు ఓడించెయ్యి."

బుచ్చిబాబు అన్నదంతా చాలా నచ్చింది గానీ, విమల్ని కాస్సేపన్నా ఏడిపించలేక పోయినందుకు విచారం పట్టుకుంది నిర్మలకి.

బుచ్చిబాబు మొహంలో గాంభీర్యం చూసి జంకి మళ్ళీ మాట్లాడకుండా ఊరుకుంది. 'బావ సహకారం లేకండా విమ్మల్ని ఏడిపించే మార్గం ఏదీ లేదా? ఏదన్నా వుందా?' అని దీర్ఘాలోచనలో మునిగి పోయింది.

"ఎందాకా వచ్చిందే నీ ప్రేమకలాపం?" అంటూ వచ్చింది విమల రెండు బుట్టల నిండా సరుకులు మోసుకుంటూ.

సరుకులన్నీ వంటింట్లో సర్దుతూ సంభాషణ కొనసాగించారిద్దరూ.

"నీ ప్రేమకలాపం ఏమిటి? మీ ప్రేమ కలాపం అను."

"ఆ మాట బుచ్చిబాబు కూడా చెప్తే అప్పు డంటాలే."

"ఎందాకా వచ్చిందా? పాపం జవాబు వింటే ఏమై పోతావోనని జాలేస్తోంది. పెళ్ళిదాకా వచ్చేసిందిలే."

"ఓహో! ఎప్పుడూ పెళ్ళి? ఈ జన్మలోనేనా?"

"జన్మదాకా ఎందుకే? ఇవ్వాళే. ఇవ్వాళ నేను బావ గదిలోనే పడుకుంటాను. నన్ను వద్దంటాడనుకుంటు న్నావా?"

"బుచ్చిబాబు తొమ్మిది గంటలకే నిద్రపోతాడు. తర్వాత నువ్వు పిల్లిలా గదిలో దూరి పడుకుంటే పాపం తనకేం తెలుస్తుంది?".

"అయితే బావ ఇంకా మెలుకువగా ఉన్నప్పుడే నేనా గదిలో ఒక మంచంమీద పడుకుంటాను. సరేనా? పందెమేనా?"

"ఓస్! అంతమాత్రాన బుచ్చిబాబు అంగీకరించి నట్టేనా ఏవిటి? 'మన నిర్మలే కదా? నిద్రొచ్చేసి పడు కున్నట్టుందిలే' అనుకుంటాడు. అంత మాత్రాన నిన్ను ప్రేమించినట్టేనా?"

"బావ ముందే నేను నిన్ను 'విమలా! నువ్వింకో గదిలో పడుకో. నేనే ఈ గదిలో పడుకుంటా' అంటా ననుకో! బావ మాట్టాడకుండా ఊరుకుంటా డనుకో! పోనీ ఆ నిదర్శనం చాలా? అప్పుడు నమ్ముతావా?"

"ఏడిశావ్‌లే. వెయ్యి జన్మలెత్తు. అప్పుడు చూద్దాం!"

"అదుగో, అదుగో, ఓడిపోతున్నానని కుళ్ళు నీకు."

"విమలా? ఏవిటి మీ మాటలు?" అని బుచ్చిబాబు కోపంగా గదిలోంచి ఒక కేక పెట్టాడు.

"ఒక నవల్లో సంగతి చెప్పుకుంటున్నాం" అని విమల మళ్ళీ తిరుగు కేక పెట్టింది.

"నీకసలు మతి లేదు విమలా!" అని బుచ్చిబాబు రెండో కేక పెట్టాడు.

"నిన్ను చేసుకున్నాక ఇంకెలా వుంటుందిలే" అని విమల మూడో కేక పెట్టింది.

ఆ కేకల సంభాషణ అయ్యాక కాస్సేపటికి అందరూ అన్నాలకి లేచారు.

భోజనాలయ్యాక బుచ్చిబాబు వరండాలోకి పోయి మళ్ళీ రాసుకుంటూ కూర్చున్నాడు.

నిర్మల, విమలా వాళ్ళ గదిలో తచ్చాడింది కాస్సేపు. ఎలాగన్నా విమల్ని ఓడించాలని శతకోటి ఉపాయాలు!

బుచ్చిబాబూ, విమలా పడుకునే మంచాల్లో ఒక మంచాన్ని దూరంగా కిటికీ దగ్గరికి ఈడ్చి, దానిమీదెక్కి పెద్ద దుప్పటి కప్పేసుకుని పడుకుంది. తను అలా చేస్తే విమలకి కొంచెమన్నా ఉడుకుమోత్తనం వొస్తుందని నిర్మల నమ్మకం.

ఏం జరుగుతుందో చూద్దామని విమల వేరే గదిలో కూర్చుని పుస్తక పఠనంలో మునిగింది.

పదయ్యేసరికి బుచ్చిబాబు ఆవలిస్తూ గదిలోకి వెళ్ళి అక్కడ నిర్మల్ని చూసి "ఇిర్మళ్ళీ ళేపుతావా విమళా?" అంటూ వొచ్చాడు.

"అక్కడ పడుకుందా?" అంది విమల తనకేం తెలీనట్టు.

"ఇిద్ర పట్టేసినట్టుంది. పాపం" అన్నాడు.

"పోనీలే పడుకోనియ్యి. నిద్రపోయేదాన్ని లేపడం యెందుకు? నీ మంచం నీకుందిగా? అది నీకేం అడ్డొచ్చింది?" అని విమల మళ్ళీ పుస్తకంలో మొహం పెట్టేసుకుంది.

బుచ్చిబాబు నిద్రమత్తులో ఊగుతూ "విమళా! ఒకళాచేద్దాం. నేనిక్కడే పడుకుంటాలే. నువ్వెళ్ళి ఆ గదిలో పడుకో" అని మొరాయించి నించున్నాడు.

"ఈ మంచం చాలదు నీ కాళ్ళకి. మంచం చాలక తెల్లార్లూ నిద్రపట్ట లేదంటావు."

"పోనీ ఇంకోళా చేస్తాలే. ఆ పెద్ద మంచం బైటికి తెచ్చేసుకుని నేను పడుకుంటాను. చిన్న మంచం నీ కోసం గదిలో పడేస్తాను."

"అబ్బబ్బా! హనుమంతుళ్ళాగ మంచాలు ఇటూ అటూ బాగానే మోస్తావుగానీ... ఇప్పుడా గోలంతా ఎందుకు? అసలే నిద్రొస్తుందంటున్నావు. వెళ్ళి అక్కడే పడుకో!"

"ఆఁ, ఒకళా చేద్దాం. ఇక్కడ నేను కిందపడుకుంటాలే, హాయిగా వుంటుంది. నువ్వెళ్ళి గదిలో పడుకో!"

"ఏమిటి, అంత విసిగిస్తున్నావు, కింద పడుకుంటే జలుబు చేస్తుంది. వెళ్ళి నీ మంచంమీద పడుకో! అది లేచి నిన్ను కరుస్తుందనుకుంటున్నావా యేమిటి? వెళ్ళు, నేను చదువుకోవాలి."

బుచ్చిబాబు మాట్లాడకుండా వెళ్ళి తన పక్క ఎక్కి రెండో నిముషంలో నిద్రపోయాడు.

విమల చాలా సేపటిదాకా చదువుతోనే ఉంది. అప్పుడే ఇక పడుకుందామని లైటు తియ్యబోతోంటే, నిర్మల గాలి దుమారంలాగ గదిలోంచి దూసుకొచ్చి 'అయ్య బాబోయ్" అని అరుస్తూ విమలమీద పడింది. "ఎలా భరిస్తున్నావే ఈ మొగుణ్ణీ? నాయనోయ్! నీకూ నీ మొగుడికీ వెయ్యి నమస్కారాలేవ్! హడలగొట్టి చంపేశాడేవ్" అని ఎగిరి బల్ల ఎక్కింది.

"ఏమైందే?" అని విమల తాపీగా అడిగింది.

"మొదట పిల్లులేమో అనుకున్నానే కాస్సేపు. తర్వాత ఏ మూలన్నా పాము జేరిందేమోనని హడలిపోయాను. తర్వాత భూతాలేమోననుకున్నా. ఆంజనేయుణ్ణి కూడా తలుచుకుని దణ్ణం పెట్టుకున్నానే, తగ్గితేనా? గది నిండా ఈలలు, ఊళలు, బుసబుసలు, గుసగుసలు, బరబరలు, గురగురలు... బాబోయ్! అదేం మొగుడేవ్? ఎల్లా భరిస్తున్నావేవ్? నీ పాతివ్రత్యంమండా! నేనైతే ఎప్పుడో వదిలేసి పారిపోదును. నాయనోయ్!"

విమల కంగారుగా లేచింది.

"బాగా గురక పెడుతున్నాడా? పాపం ఈమధ్య ఒంట్లో బాగుండడం లేదే! టాన్సిల్సో ఎడినాయడ్సో, అవేవో అన్నారు" అంటూ విమల కంగారుగా బుచ్చిబాబు మంచం దగ్గరికి పరిగెత్తి ఒక నిమిషం నించుని చూసింది. తర్వాత వంటింట్లోకి వెళ్ళి ఒక గ్లాసుడు నీళ్ళు కాగబెట్టి తెచ్చింది. ఒక మాత్ర తీసి "బుచ్చిబాబూ! బుచ్చిబాబూ!" అంటూ నెమ్మదిగా తట్టి లేపింది. "ఒక్కసారి లేచి మాత్ర వేసుకో, సరిగ్గా ఊపిరాడక ఇబ్బంది పడుతున్నావు. కొంచెం వేడినీళ్ళు తాగు" అని బతిమాలుతూ చెప్పింది.

బుచ్చిబాబు నిద్రమత్తులోనే లేచి, మాత్ర మింగేసి, వేడినీళ్ళు గటగటా తాగేసి, మళ్ళీ వొరుగుతూ "నువ్వింకా పడుకోలేదా విమళా?... తొందరగా ప... డు... కో" అంటూ నిద్రలోకి జారిపోయాడు.

అతనికి కొంత తేలిగ్గా ఉండడం చూసి దుప్పటి కప్పి బయటికి వొచ్చింది విమల.

"బాబోయ్! అదేం మొగుడేవ్?" అని నిర్మల ఇంకా వొణుకుతూనే వుంది.

"ఏడిశావ్‌లే. మనిషన్న తర్వాత జబ్బులు రావా?" అని విమల నిర్మల నెత్తిమీద ఒక దిప్పకాయి తీసింది.

"వొస్తే ఆ పూటే వొదిలెయ్యాలి. ఇంకా ఎందుకు వదల్లేదే?" అంది నిర్మల కోపంగా.

"మరి బుచ్చిబాబుని పెళ్ళి చేసుకుంటానన్నావుగా?"

"నా కొద్దుబాబోయ్! నీ గురగురల మొగుణ్ణి నువ్వే ఉంచుకో" అంటూ నిర్మల బల్లమీదనించి మంచంమీదకి దూకి దుప్పటి ముసుగెట్టేసుకుంది.

★ ★ ★

మర్నాడు పొద్దున్న విమల చీకట్నే వీధి తలుపులు తీసేప్పటికి ఎవరో ఒక చిన్నవాడు నార తడపలాగ గేటు పట్టుకుని వేళ్ళాడుతూ దాన్ని తియ్యడానికి విశ్వప్రయత్నాలు చేస్తూ విఫలుడౌతున్నాడు.

గుమ్మంలో విమల కనపడగానే ఆ యువకుడు గేటు కన్నాల్లో మొహం పెట్టి "బుచ్చిబాబు గారిల్లు... ఇదేనాండీ?" అన్నాడు.

"అంత పెద్ద బోర్డు కనపడ్డం లేదూ? కళ్ళజోడు ధరించకపోయావ్" అందామనుకుంది విమల. చీకట్నే జోకులెందుకు లెమ్మని "ఇదేనండీ" అంటూ తనే గేటు దగ్గరికి వెళ్ళి గేటు తీసింది. "బుచ్చిబాబు ఇంకా లేవలేదు. లోపలికి వచ్చి కూర్చోండి!" అంది.

"ఆయన.. కోసం కాదండీ..."

"మరెవరికోసం? ఎవరు కావాలి మీకు?" అని విమల అనబోతోంటే, లోపల్నించి నిర్మల తుఫానులా నిద్రకళ్ళతో పరిగెత్తుకొచ్చింది - "రా, రా! చిన్నబ్బాయ్! నీ కోసమే చూస్తున్నా. వొచ్చేశావా? ఎప్పుడెక్కావు రైలు?"

"రాత్రే ఎక్కా! తెల్లార్లూ నిద్రేపట్టలేదు నీలూ!"

"నాకూ పట్టలేదు. రా, రా!" అని నిర్మల చిన్నబ్బాయికి ఆహ్వానం పల్కి "నా ఫ్రెండ్‌లే విమలా! నా క్లాస్‌మేట్! నువ్వు ఫో! మేం మాట్లాడుకోవాలి" అని నవ్వు మొహంతో చిన్నబ్బాయిని లోపలికి లాక్కొచ్చింది.

"ఓసి దీని దుంపతెగా!" అని విమల ఆశ్చర్యపడుతూ లోపలికి వచ్చేసింది.

నిర్మలా, చిన్నబ్బాయీ, ముందు గదిలో కూర్చుని మాటల్లో మునిగిపోయారు.

"అసలెప్పుడెక్కావూ? బట్టలేవీ? తెచ్చుకోలేదా?"

"తెచ్చుకున్నా నీలూ! ఒక ఫ్రెండ్ రూములో ఉన్నాయి."

"ఎప్పుడు బైల్దేరావు? ఎక్కడెక్కావు? ఎక్కడ దిగావు? ఎలా వచ్చావు?" అని నిర్మల ప్రశ్నల వర్షం కురిపించేస్తోంది.

చిన్నబ్బాయికి పంధొమ్మిదేళ్ళు కన్నా ఎక్కువుండవు. సన్నగా, పొడుగ్గా బెత్తంలా వున్నాడు. లేత గచ్చకాయ రంగు పేంటుమీద తెల్లచొక్కా వేసుకున్నాడు. అంట కత్తెరేసిన క్రాపు. తెల్లని, నున్నని చెంపలు. ఆడపిల్ల చూపుల్లాగా బెదురుగా వున్నాయి చూపులు.

నిర్మలా, అతనూ మాట్లాడుకుంటోంటే ఇద్దరు స్నేహితురాళ్ళు మాట్లాడుకుంటున్నట్టే ఉంది.

విమల లోపల్నించి "నిర్మలా! మొహం కడుక్కోవే! ఏడైపోయింది" అని అరిచింది.

"ఆఁ, కడుక్కుంటాలే, నాకు తెలుసులే. నువ్వు పిలవకూ. రా చిన్నబ్బాయ్! మొహాలు కడుక్కుందాం" అని నిర్మల చిన్నబ్బాయి రెక్క పట్టుకుంది.

"నేను కడిగేసుకున్నా. స్నానం కూడా చేసేశా."

"నువ్వు కడిగేసుకున్నావా? చేసేశావా? సరేలే, నేను వెళ్తాలే తర్వాత."

"కాదు, నువ్వెళ్ళి తొందరగా మొహం కడుక్కురా నీలూ!"

"అయితే, నువ్వు నా దగ్గిరే నించో! కబుర్లు చెప్పు! ఎప్పుడెక్కావూ? వొద్దులే, నువ్వు రావొద్దు! పళ్ళు తోముకునేప్పుడు పక్కనెవరూ ఉండకూడదు."

"వెళ్ళేసి తొందరగా రా నీలూ!"

"పోనీ నువ్వూ వొస్తావా?"

"వొద్దు! తొందరగా వొచ్చెయ్!"

"ఇక్కడున్నట్టు వొచ్చేస్తా!"

నిర్మల ఇలా వెళ్ళి అలా వొచ్చేసింది మొహం తుడుచుకుంటూ.

వాళ్ళ గుడగుడలకి లేచిపోయిన బుచ్చిబాబు వరండా గుమ్మంలో కొచ్చి తొంగిచూశాడు.

"నా ఫ్రెండ్‌లే బావా! నువ్వెళ్ళి మొహం కడుక్కో!"

"నువ్వు కడుక్కున్నావా? నీ ఫ్రెండ్ కడుక్కున్నాడా?"

"ఆఁ, వసంత్ స్నానం కూడా చేసేసి వచ్చాడు. నువ్వు ఫో బావా! కాఫీ తాగు!"

"నువ్వు తాగావా? నీ ఫ్రెండు తాగాడా?"

"నా ఫ్రెండు కాఫీ టీలు తాగడు. చుట్టా బీడీ సిగరెట్ ఏదీ కాల్చడు. అబ్బా, నువ్వు ఫో బావా! మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకండి! చాలా మాట్లాడుకోవాలి...."

"సరేలే, సరేలే, వెళ్ళిపోతున్నాలే" అనేసి బుచ్చిబాబు లోపలికొచ్చేశాడు — "విమలా! వసంత్ చక్కగా వున్నాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటోంటే ఇద్దరు ఆడపిల్లలు మాట్లాడుకుంటున్నట్టుగా ఉంది."

"వసంతెవరు?"

"నిర్మల ఫ్రెండ్ లేడూ? అతనే."

"అతని పేరు వసంతా? నాకు 'చిన్నబ్బాయి' అని చెప్పిందే!"

"చిన్నబ్బాయా? నాకు వసంతని చెప్పిందే!"

"ఒసే విమలా!" అంటూ పరిగెత్తుకొచ్చింది నిర్మల. "నా ఫ్రెండు కాఫీ టీలు తాగడు. పాలిస్తావో, నీళ్ళిస్తావో పట్టుకురా! నే పోతున్నా..."

"ఒసే నిర్మలా, నిర్మలా! నీ ఫ్రెండ్ పేరు వసంతా, చిన్నబ్బాయా?"

"రెండూనూ! అబ్బబ్బా, వొకటే ప్రశ్నలు! మాట్లాడుకోనివ్వరు."

"సరేగానీ, ఇదుగో ఈ టిఫిన్ పట్టుకుపోయి నువ్వూ నీ ఫ్రెండూ తినండి!"

"పట్టుకురా! నాకు ఖాళీలేదు" అంటూ వెళ్ళిపోయింది నిర్మల.

విమల రెండు ప్లేట్లతో వాళ్ళ దగ్గిర ఇడ్లీలు పడేసి "నిర్మలా! లేచి స్నానంచేసి, తల దువ్వుకుని ఎంతసేపన్నా కూర్చో! మళ్ళీ పిలవను" అంది.

"అబ్బబ్బా! అన్నీ ఆటంకాలే. నువ్వు చేసుకో స్నానాలూ జపాలూ!"

"సరేలే, నీ ఇష్టం! అలా కూర్చో చెవట కంపుతో!"

విమల వంటింట్లో పనంతా అవగొట్టేసి స్నానం కూడా చేసేసింది.

నిర్మల లోపలికి ఊడిపడలేదు.

"నిర్మలా! ఒకసారిలా రా!"

"అబ్బా, ఏవిటే, పిలిచావా?"

"ఇప్పుడు టైమెంతైందనుకున్నావూ? పది దాటింది. బుచ్చిబాబు కోర్టుకి కూడా వెళ్ళిపోయాడు. నా పనులన్నీ అయిపోయాయి. నీ మాటలేవన్నా తెమిలాయా లేదా?"

"తెమిల్తే నేనే వచ్చే దాన్నిగా? దీనికా పిల్చావు?" అనేసి నిర్మల మళ్ళీ పరిగెత్తింది.

పదకొండూ పదీ!

"నిర్మలా! ఒకసారిలా రా!"

"అబ్బ. ఏవిటే, పిలిచావా? నా మీద పట్టించావేమిటి?"

"నీ మొహంగానీ, పదకొండు దాటింది. తిండికి వస్తావా లేదా?"

"మాకు తిండీ గిండీ అక్కర్లేదు. నువ్వు మింగు

కావాలంటే... వొస్తానుండు. నా ఫ్రెండు వెళ్ళిపోతున్నాడు. వచ్చేస్తానుండు" అంటూ నిర్మల మళ్ళీ పరిగెత్తింది.

ఇద్దరూ గేటు దగ్గిర చేరారు. అక్కడ మళ్ళీ మాటలు! అరగంట దాటేసింది.

"వసంత్! సాయంత్రం వచ్చెయ్యేం? మాట్లాడినట్టే లేదసలు. ఇలా వొచ్చి అలా వెళ్ళిపోతున్నావు. నీ కోసం చూస్తూ వుంటా సాయంత్రం."

"వొచ్చేస్తాను నీలూ! ఐదుకల్లా ఇక్కడుంటాను" అంటూ ఫ్రెండు గేటు దాటాడు.

నిర్మల చూసి చూసి ఏడుపు మొహంతో లోపలి కొచ్చింది. "విమలా, విమలా! ఎక్కడే? పలికి చావవేం? విమలా!" అంటూ ఎగురుకుంటూ వొచ్చి ఎదురొస్తోన్న విమల కాళ్ళమీద పడిపోయింది.

"విమలా! ఇవి చేతులుగావే, కాళ్ళనుకో!..."

"ఏడిశావులే. అవి కాళ్ళే?"

"కాళ్ళేనా? అబ్బా! మతి పోతోందే నాకూ. ఇవి కాళ్ళుగావు, చేతులనుకో! నాకు అభయహస్తం ఇవ్వాలే విమలా! ... అభయ పాదం అనాలా యేమిటే? ఏదో ఒకటిలే, అదేదో నువ్వే అనుకో! ఇస్తావా లేదా చెప్పు! తొందరగా చెప్పు! లేకపోతే నీ పాదాల దగ్గిరే తలకాయ బద్దలకొట్టుకుని చచ్చిపోతాను."

"ఎందుకూ?"

"అభయ పాదం ఇస్తానని చెప్పు!"

"అబ్బా, నా కాళ్ళొదులు ముందు."

"ఊహూ! ఇస్తావా లేదా చెప్పు!"

"నాకు చేతకాదే అదేవిటో. నన్నేం చెయ్యమంటావో చెప్పు!"

"చెపుతా తర్వాత. ముందు అభయ...."

"అబ్బా, ఇస్తాలే."

"మళ్ళీ మాట మార్చకూడదు."

"మార్చన్లే. నా కాళ్ళు లాగి లాగి నన్ను కింద పడేసేలా వున్నావ్! చెప్పు, ఏం కావాలి?"

"నువ్వూ బావా సాక్షి సంతకాలు పెట్టి, నాకూ చిన్నబ్బాయికీ, సాయంత్రమో రేపొద్దున్నో రిజిస్టర్ పెళ్ళి చేయించెయ్యాలి."

విమల కెవ్వున అరిచి, దబ్బున కిందపడిపోయింది — "మంచినీళ్ళు! మంచినీళ్ళు!" అని అరుస్తూ.

"తెస్తానుండు!" అని నిర్మల వంటింట్లోకి పరిగెత్తి చెంబుడు నీళ్ళు మోసుకొచ్చింది.

విమల ఆ నీళ్ళన్నీ తాగేసి, "హూ, హూ!" అని మూలగడం మొదలెట్టింది.

"ఏమే విమలా! మా పెళ్ళే..."

కెవ్వున అరిచి విమల మళ్ళీ ఒరుగుతూ "పడిపోతున్నాను, పట్టుకో, పట్టుకో" అని అరిచింది.

"అబ్బ, చాల్లే! ఎన్నిసార్లు స్పృహ తప్పుతావేంటీ? ఇందాక తప్పావుగా? ఇక కట్టిపెట్టు!... విమలా! ఏమే! కొంచెం దయదల్చవే! మా పెళ్ళే!"

"పెళ్ళా!"

"అవునే!"

"నీకా?"

"అబ్బ, నా కొక్కదానికే కాదు. మా ఇద్దరికీ."

"............................"

"విమలా! ఏమే? నీ ఫోటోపెట్టి పూజించుకుంటావే రోజూ రెండుసార్లు!"

"రెండు సార్లేనా?"

"పోనీ ఐదుసార్లే."

"ఐదు సార్లేనా?"

"ఏడిసినట్టే వుంది. నూట పదహారు సార్లు చెయ్యమంటావేమిటే నీ పూజలు? ఇక మేమేవన్నా పనీపాటా చేసుకోవాలా, లేదా? విమలా! కొంచెం దయదల్చవే!"

"నీ పెళ్ళి నేను చెయ్యడం ఎందుకూ? మీ అమ్మే చేస్తుందిగా?"

"అమ్మో, చంపేస్తుంది. చిన్నబ్బాయి మన కులం కాదంటుంది. అసలు ఈ గాధంతా నీకు చెప్పాలనే వొచ్చానే."

విమల బాసింపట్టు వేసుకుంది, నిర్మల గాధ వినడానికి.

నిర్మల తన దీనగాధ చెప్పకొచ్చింది.

తను చిన్నబ్బాయిని గాఢంగా ప్రేమిస్తోందట. చిన్నబ్బాయి కూడా తనని గాఢంగా ప్రేమిస్తున్నాడట. అంతలో తన తల్లిదండ్రులు తనకి వేరే పెళ్ళి సంబం

ధాలు చూస్తున్నారట. తన ప్రేమగాథ చెపితే వాళ్ళు ఖయ్యిమంటారట! ఎందుకంటే, తన ప్రేమ కులాంతర ప్రేమ కాబట్టి అట! తన ప్రేమని వాళ్ళు గుర్తించరని తను చిన్నబ్బాయిని ఇక్కడికి వొచ్చెయ్యమని ఉత్తరం రాసి, తను ఇక్కడికి పరిగెత్తుకు వచ్చేసిందట. చిన్నబ్బాయి కూడా వొచ్చాక అసలు సంగతి చెపుదాం లెమ్మని ఈ రెండు రోజులూ ఊరుకుందట. తను ఇప్పుడు తన ప్రియుణ్ణి అర్జంటుగా పెళ్ళి చేసుకోకపోతే తన తల్లిదండ్రులు తనని స్వకులంలో ఏ దుర్మార్గుడికో, రాక్షసుడికో, నీచుడికో, క్షుద్రుడికో, దుష్టుడికో ఇచ్చి పెళ్ళి చేస్తారట. అదట ఇప్పుడొచ్చిపడ్డ ఉపద్రవం!

"అంతా చెప్పేశానే విమలా! ఏం చేస్తావో నీదే భారం. నువ్వు మా పెళ్ళి చెయ్యనంటే మేము ఉరి పోసుకు చనిపోవడమో, సముద్రమున పడిపోవడమో ఆలోచించుకుంటాం. చిన్నబ్బాయి, బంధువు లెవరో ఉన్నారని వెళ్ళాడు. ఆనక వొచ్చేస్తాడు. అప్పటికి ఏ సంగతీ చెప్పెయ్యాలి" అని ముగించింది.

"...................."

"విమలా! విమలా! మాట్లాడవేమే?"

"ఉండు, ఆలోచిస్తున్నాను."

"కొంచెం తొందరగా ఆలోచించవే! సాయంత్రం అయిపోతోందే."

"ఊఁ, ఆలోచించాను." దీర్ఘాలోచనలో మునిగిన విమల తల ఎత్తి — "సరే, అతను రాగానే ఉరి పోసుకు చనిపోవాలో, సముద్రమున పడిపోవాలో, తేల్చేసుకోండి! ఇక అన్నాలకి లేద్దామా?" అని లేవబోయింది.

"నాకేం అక్కర్లేదు అన్నం పిన్నం. నువ్వు మింగు. నేను ఇక్కడే ఈ నట్టింట్లోనే కూచుని కూచుని కృశించి కృశించి చచ్చిపోతాను."

"సరే అయితే, అదేదో మొదలుపెట్టు. నేను లేస్తాను మరి అన్నానికి. చింత చిగురుపప్పు బాగానే కుదిరింది. వడియాలు కూడా వేయించాలే. తినేసి తొందరగా వస్తాలే" అంటూ లేచింది విమల.

నిర్మల మళ్ళీ విమల కాళ్ళు పట్టుకుని కిందకి లాగి, "విమలా! విమలా! అంతేనా? ఏమే నువ్వు కూడా అంతేనా? మా ప్రేమని నువ్వు కూడా గుర్తించవా?" అని ఏడుపు మొదలుపెట్టింది.

విమల ఖయ్యిమంది.

"ఏడిశావ్‌లే, ఏం ప్రేమే ఇదీ? నీకు పదిహేడేళ్ళు. వాడికి ఇంకో ఏడాది ఉంటుందేమో. ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే ఆరు నెలల్లో విడాకులిచ్చుకుంటారు."

"హరి హరీ! ఎంతమాట విన్నాను! ఎంతమాట! నా చెవులు పగిలిపోకుండా ఉన్నాయేమీ?" అని నిర్మల చెవులు మూసుకుని ఆక్రోశించింది.

"ఏడిశావ్‌లే, ముందు దవడ పగిలిపోకుండా చూసుకో! నా ప్రశ్నలకు సీరియస్‌గా జవాబులు చెప్పు! అసలు నీకీ ప్రేమ జబ్బు ఎలా సంభవించిందో చెప్పుకురా! ఎన్నాళ్ళ కిందటి నించీ మొదలు ఇది?"

"మూడు నెలలయ్యిందే, అబ్బా! మూడు యుగాలైనట్టుందే!"

"సరేలే! కవిత్వం రానివ్వకు. జరిగింది జరిగినట్టు చెప్పు."

"ఏమీ లేదే! ఓసారేమో మా కాలేజీలో మామిడి చెట్టు కింద నుంచుంటే చిన్నబ్బాయి నన్ను చూసి నవ్వాడే. నేనూ నవ్వానే. ఆ మర్నాడేమో 'నిర్మలగారూ' అని పిల్చాడే! నేనూ 'వసంత్‌గారూ' అన్నానే. అతని బళ్ళో పేరు వసంత్‌లే. మళ్ళీ ఆ మర్నాడేమో 'నిర్మలా! నేను నీ కోసమే పుట్టాను' అన్నాడే. 'అవును వసంత్, నేనుకూడా నీ కోసమే పుట్టాను' అన్నానే. అప్పుడేమో...."

"ఓహో! మీ ప్రేమ పెద్ద పెద్ద దూకుళ్ళతో అభివృద్ధి చెందిందన్నమాట!"

"అవునే విమలా! వసంత్ బాగా పొడుగు జుట్టు పెంచుకునేవాడు. 'నీ మొహం కనపడక నాకు దిగాలేస్తోంది వసంత్! అంత పొడుగు జుట్టు తీసెయ్యి. లేకపోతే గట్టిగా జడేసుకో' అన్నానే. ఆ మర్నాడే చిన్న క్రాపు చేయించుకుని వొచ్చేశాడే! నాకు నచ్చని మచ్చల చొక్కాలు కూడా మానేసి తెల్లచొక్కాలు కుట్టించుకున్నాడే. అప్పుడనుకున్నాను గట్టిగా, నేనీ భూప్రపంచంలో వసంత్‌ని తప్ప ఇంకెవ్వరినీ పెళ్ళి చేసుకోకూడదని."

"అతని పొడుగు జుట్టూ, మచ్చల చొక్కాలూ

ఇష్టం లేదా నీకు?"

"ఊహూ! ఇష్టంలేదు."

"మరైతే, పొడుగు జుట్టూ, మచ్చల చొక్కాలూ ఉన్నప్పుడే ఎలా ప్రేమించావు?"

"అబ్బా, ఏవిటే విమలా, నన్నేడిపించకే. చెప్పేది వినవే. చిన్నబ్బాయి చాలా మంచివాడే."

"నీ మొహం మంచివాడు! గేటు తియ్యడం రాని తెలివితక్కువ దద్దమ్మని ప్రేమించావు!"

"మీ గేటు సంగతి చెప్పకమ్మా! అంత తుప్పుపట్టి ఏడ్చిందది" అని ఖయ్యమంది నిర్మల.

"సరే, గేటుని వొదిలేద్దాం. ఇప్పుడు పెళ్ళి చేసుకుని ఎక్కడ వుంటారు మీరిద్దరూ?"

"ఎక్కడో ఉంటాం."

"ఎలాగ బతుకుతారు?"

"ఎలాగో బతుకుతాం."

"ఏం తింటారు?"

"ఏదో తింటాం."

"అయితే సరే, మిమ్మల్నిద్దర్నీ సాయంత్రం తీసుకెళ్తాలే.

నిర్మల నవ్వు మొహంతో అంది —"రిజిస్ట్రారాఫీసుకేనా?"

"పిచ్చాసుపత్రికి."

"మాకేం పిచ్చెక్కలేదు."

"ఈ రకం ప్రేమా పిచ్చీ ఒకటే. పదిహేడేళ్ళకి పెళ్ళి చేసుకుంటావేం, పెళ్ళీ? ఇల్లూ వాకిలీ లేదు. ఉద్యోగం సద్యోగం లేదు. తాడూ, బొంగరం లేదు. పెళ్ళి చేసుకుని ఎలా బతుకుతావే? అన్నట్టు, వెయ్యేళ్ళదాకా పెళ్ళి చేసుకోనన్నావుగా అసలు? ఆ మాటే మరిచిపోయాను."

"వారం రోజుల్లో చేసుకుంటే చేసుకుంటానేమో అన్నాగా మళ్ళీ?"

"ఓహో, ఇదన్నమాట సంగతి! అనివార్య పరిస్థితి రెండ్రోజుల్లో వచ్చినా రావొచ్చు — అన్నావు. ఇదా సంగతీ? నోరు మూసుకుని ఎవరిదారిన వాళ్ళు వెళ్ళండి. ముందు చదువులు పూర్తి చెయ్యండి. అటెనక ఇద్దరూ ఉద్యోగాలు సంపాదించుకోండి. అప్పుడు పెళ్ళి గిళ్ళీ!"

"అమ్మో! ఎన్నాళ్ళు పడుతుందే అదంతా!"

"పదేళ్ళు పట్టొచ్చు."

నిర్మల నేలకొరిగింది.

"ఏడిశావులే. లేచి కూర్చో" అని విమల కేక పెట్టగానే హడలి పోతూ లేచి కూర్చుంది. "పదేళ్ళా!" అని కలవరించింది.

"పోనీ ఎనిమిదేళ్ళు."

"ఈలోగా పెద్దవాళ్ళు నాకు ఏ రాక్షసుడితో నన్నా..."

"ఎదిరించూ! నా కిష్టంలేదని చెప్పెయ్యి. సమస్య వొచ్చినప్పుడు పోట్లాడకుండా పారిపోయే బతుకేం బతుకే? ధైర్యంగా నిలబడూ! నీ కోసం సంబంధాలు చూడక్కర్లేదని చెప్పెయ్యి. ఇంకా మీ వాళ్ళు మొండితనం చేసి సంబంధం నిర్ణయిస్తే అప్పుడే బైటికి రావచ్చు, వాళ్ళని పళ్ళు రాలగొట్టి."

"ఆ పని ఇప్పుడే చేసేస్తే!"

"ఇప్పుడే చేస్తే ఏం తింటావే గాడిదా? బుద్ధి లేకండా తయారయ్యావు. ఈ వసంతుడు నిన్నే గంగలో ముంచుతాడో! వాడి మంచి చెడ్డలు తెలుసు కోకుండా అంత తొందరెందుకే దున్నపోతా?"

"హరి హరీ! ఎంతెంత మాటలంటున్నావే! నన్నెన్ని మాటలైనా అను, నా వసంత్‌ని అంటే భరించలేను. నీ కాళ్ళ దగ్గర తలబద్దలు కొట్టుకుని చచ్చిపోతాను."

"ఉండు, నా కాళ్ళు చితగ్గొట్టకు, పీడ! ... ఇంతకీ ఎంత కట్నం ఎన్ని కానుకలూ కావాలంటున్నా డేవిటి నీ ప్రి... యు... డు?"

"ఛీ ఛీ! కట్నం తీసుకుంటాడా నా వసంత్!"

"ఏం తీసుకోడా? తీసుకోకపోతే రేపట్నించీ సాధించి చంపుతాడే ఫోజుకొట్టీ. ఎంతో కొంత పారెయ్యడమే మంచిది."

"శివ శివా! నా వసంత్‌ని ఎంత అపార్థం చేసుకున్నావే!"

"నాలిక తెగ్గోస్తాను, ఆ వెధవ కూతలేమిటి అస్తమానూ? నోరు మూసుకుని చెప్పింది విను. ప్రేమ గుడ్డిది. వొప్పుకుంటావా ముందు?"

"వొప్పుకోను. ప్రేమ, జ్వాజ్వల్యమానమైన కాంతి! ప్రేమ, మిట్ట- మధ్యాహ్నపు మార్తాండుడి వెలుగు!

ప్రేమ, ఉన్నతాగ్రాలను చేర్చే సాహసం! ప్రేమ, అనంతానంత విశ్వసౌందర్యం! బంగారాన్ని అగ్ని శుద్ధి చేసినట్టు, మానవుల్ని ప్రేమ శుద్ధి చేస్తుంది. ప్రేమ గుడ్డిది కాదు. పిచ్చి విమలా, తెలిసిందా?"

"ప్చ్! బాగా ముదిరింది పాపం" అని విమల గాఢంగా నిట్టూర్చింది. "ఈ మాటలన్నీ ఎవరు నేర్పారే నీకు?"

"ప్రేమే నేర్పింది."

"పోనీ ప్రేమ గుడ్డిది కాదులే. నేనూ ఒప్పు కుంటాను. కానీ, దానికి షార్ట్‌సైట్. దానికి దగ్గర చూపే గానీ దూరం చూపు ఉండదు. అది దూరం చూడలేదు. అదన్నా వొప్పుకుంటావా?"

"ఆలోచిస్తాలే, చెప్పు."

"మూడు నెలల ప్రేమకే జీవితం అర్పణచేస్తే — అయ్యో! పిచ్చి దానా! నవ్వాలో, ఏడవాలో తెలీడం లేదే!"

"యాడవొద్దులే. అదేదో చెప్పు."

"చక్కగా కొన్నేళ్ళు, నిరీక్షించండి. ఒకరికోసం ఒకరు ఎదురుచూస్తూ నిరీక్షించడంలో ఎంత మాధుర్యం ఉంది! కొన్నేళ్ళు ఆగితే ఎన్ని విషయాలు తెలుస్తాయి! ఎంత జ్ఞానం వొస్తుంది! ఎంత స్వతంత్ర మైన వ్యక్తిత్వాలేర్పడతాయి! ఈ లోపల మీ ప్రేమ నిజమైనదో కాదో, బలమైనదో కాదో, కాలం రుజువు చేస్తుంది. మీ మనసులు మారతాయేమో..."

"హేవిటీ! నా మనసా? ... మారుతుందా?"

"పోనీ అతని మనసూ."

"హేవిటీ! వసంత్ మనసా? ... మారుతుందా!"

"పీక నొక్కి చంపుతాను. ఏవిటా నిర్ఘాంతాలు? నేను చెప్పేదేవిటి, నువ్వర్థం చేసుకునే దేవిటి? ఒక కథ చెపుతాను, విను! నా క్లాస్‌మేట్ హేమ, ఇంకో మతంవాణ్ణి ప్రేమించి పెళ్ళి చేసుకుంది. వాళ్ళిద్దరూ మతాలు వొదిలేశారనుకున్నావా? తనే వాడి మతం లోకి మారింది. అలాంటి బానిసత్వం కన్నా ఆ ప్రేమకో సలాం కొట్టెయ్యడం వెయ్యిరెట్లు నయమా కాదా?"

"ఛీ! నేను మీ హేమలాగ చేస్తాననుకున్నావా? వసంత్ ఇంకో మతం వాడై, నన్ను తన మతంలోకి మారమంటే 'ఏడిశావ్‌లే' అని ఒక నమస్కారం పెట్టేస్తాను."

"ఈ సంగతి గాకపోతే ఇంకోటీ. హేమగాకపోతే శోభా. శోభ అనీ ఇంకో అమ్మాయి కథ. ప్రేమ వివాహమే చేసుకుంది. ఆ మొగుడు దీన్ని తీసుకు పోయి తల్లి కాళ్ళ దగ్గర పారేశాడు. ఇది ఎంత మంది పిల్లల్ని కనాలో వాడి ఇష్టం, వాడితల్లి ఇష్టం, దీని ఇష్టం కాదు."

"అయితే విమలా! పిల్లల సంగతి కూడా పెళ్ళికి ముందే మాట్లాడేసుకోవాలేవిటే?" అని కొత్త సందేహం వెలిబుచ్చింది నిర్మల కంగారు పడుతూ.

" 'నేనింత మంది పిల్లల్నే కంటాను. నీ కిష్టమేనా' అని ఎగ్రిమెంట్లూ, షరతులూ రాసుకోరు. పిల్లల విష యంలో వాడి అభిప్రాయాలెలా ఉన్నాయో గ్రహించి, వాడు చాదస్తుళ్ళా కనపడితే వాడికి మొదటే సలాం కొట్టాలి. నీ వసంతుడి రంగులు అప్పుడే నీకేం తెలుసు? 'మా నాయనమ్మకి మగపిల్లలే కావాలం'టా డేమో! 'మా మేనత్తకి ఆడపిల్లలు వొద్దం"టాడేమో! అప్పుడు వాడితో పోట్లాట వేసుకుంటాను అంటావా? అడుసు తొక్కనేల, కాలు కడగనేల? కొన్ని సంవత్స రాల పాటు వాణ్ణి పరీక్షించాలి. నిన్ను నువ్వు పరీక్షించు కోవాలి. నీ అభిప్రాయాలు స్పష్టం చేసుకోవాలి. అన్ని విధాలా నీకు సరిపడతాడనే నమ్మకం వుంటేనే... అసలు పాఠం మరిచి పోయానేవ్! వాడు 'అనితర సాధ్యుడో, కాదో' తెలుసుకోవాలి. అది ముఖ్యం అసలు!"

"బాబోయ్ విమలా! ఇంకా ముఖ్యమైన సంగతి మరచిపోయానేవ్, చిన్నబ్బాయి గురక పెడతాడేమో నాకేం తెలుసే?" అని కెవ్వున అరిచింది నిర్మల.

"అదుగో, చూశావా మరి? ... నీ ప్రేమ అంత గాఢమైందన్న మాట! నీ ప్రేమ పోవడం అంతలో ఉందన్నమాట!"

"అదికాదే, గురకపెడితే భయం వెయ్యదేం టమ్మా?"

"నోరుముయ్యే" అనే ముక్తాయింపుతో విమల ఆ సమావేశం ముగించింది.

★ ★ ★

బుచ్చిబాబు ఇంటికి రాగానే నిర్మల ప్రేమ గాథంతా విమల బుచ్చిబాబుకి రహస్యంగా వర్ణించి

చెప్పేసింది.

"బుచ్చిబాబూ! నిర్మల అసలు ఎందుకు వొచ్చిందో తెలుసా?"

"సెలవలని వొచ్చిందిగా?"

"సెలవలూ కాదు, ఏమీ కాదు. నిర్మల తల మునకలుగా ప్రేమలో పడిపోయింది."

"ప్రేమలో పడిపోవడం ఏమిటి విమలా, బాత్ రూమ్‌లో పడిపోయినట్టూ?" అని నవ్వాడు బుచ్చి బాబు.

"పొద్దున్న రాలా, దాని ఫ్రెండూ? వాడితో దీనికి పెళ్ళి చేసెయ్యాలట! లేకపోతే చచ్చిపోతానని నా కాళ్ళు వాటేసుకుని కూర్చుంది గంటసేపు."

"అయ్యో! చచ్చిపోడం ఎందుకూ? ఏదీ, నిర్మ లేదీ?"

"వంటింట్లో ఉంది."

"ఏడీ, ఆ కుర్రాడేడీ, వొచ్చాడా? ఇద్దరికీ పెళ్ళి చేసేద్దాం."

"ఊఁ, తర్వాత?"

"పాపం, వాళ్ళ బతుకు వాళ్ళే, బతుకుతారు."

"ఎలా బతుకుతారు?"

"ఎలాగో బతుకుతారు."

"నిర్మలకి నేను బోధించిందంతా కుప్ప చేస్తావు గావున్ను. దానికి మైనారిటీ కూడా తీరలేదు. నువ్వు పెళ్ళి చేస్తానంటే వాళ్ళిద్దరూ ఇప్పుడు నీ వెంట పడతారు. నిర్మల్ని పిల్చి కేకలేస్తావని నీకు చెపుతోంటే చెప్పేది బుర్రకెక్కించుకోవేం?"

"పాపం ఎందుకు విమలా, వాళ్ళని కేక లెయ్యడం? చక్కగా పెళ్ళి చేసేస్తే వాళ్ళే చదువు కుంటారు. ప్రేమించడం తప్పా చెప్పు?"

"ప్రేమించడం తప్పో ఒప్పో నీ దగ్గిర నేను నేర్చు కోనక్కర్లేదులే. ప్రేమించగానే పెళ్ళికి ఎగబడాలా? కొన్నాళ్ళు ఆలస్యమైతే ఎదటివాళ్ళు, మారిపోతారేమో, తప్పి పోతారేమో అని భయం ఉంటేనే వాళ్ళని తొంద రగా పెళ్ళిలో ఇరికించెయ్యాలని చూస్తారు. లేకపోతే అంత తొందరెందుకు?"

"ఆ సంగతి చెప్పావా నిర్మలకి?"

"అన్నీ చెప్పాను. ఇద్దరూ చక్కగా చదువుకుంటు న్నారు. ఇప్పుడు పెళ్ళేవిటి? నిర్మల్ని పిల్చి కేక లేస్తావా లేదా చెప్పు?"

"నీ కేకలెయ్యడం అయిందా?"

"సగమే అయింది."

"సరే, పిలువు. నేనూ కొంచెం కేకలేస్తాలే."

"నిర్మలా! బుచ్చిబాబు పిలుస్తున్నాడే" అని విమల వంటింట్లోకి ఒక కేక పెట్టింది.

నిర్మల సిగ్గుపడుతూ వొచ్చి నించుంది. "ఏంటి బావా? పిలిచావా?"

"ఊరికేలే. ఏం చేస్తున్నావు? మళ్ళీ వంట మొదలుపెట్టావా? ఏం కూర వండుతున్నావు?"

"కాకరకాయ వేపుడు, విమలే చెప్పింది."

"కాకరకాయల్లో కూడా చేదు చూడాలి. తెలుసా?"

"తెలుసు."

"అదే చెపుదామనీ ... నీ ఫ్రెండ్ చాలా ముద్దుగా ఉన్నాడు నిర్మలా! పొద్దున్న వొచ్చిన కుర్రాడేగా? చాలా బాగున్నాడు. బుద్ధివంతుళ్ళాగున్నాడు... మంచి పని చేశావు."

"ఏవిటి నువ్వు మాట్లాడేదీ?" అని విమల కళ్ళెర్ర జేసింది.

"వొస్తున్నానా వరసగా? పాయింటు తర్వాత పాయింటు బిల్డప్ చెయ్యాలి... నిర్మలా! నువ్వింకా చిన్నపిల్లవే కదమ్మా?... ఇంకో ఆర్నెల్లు ఆగు!"

"ఆర్నెల్లా, ఆరేళ్ళా? సరిగ్గా చెప్పు దానికి" అని విమల బుచ్చిబాబుని మళ్ళీ కోపంగా చూసింది.

"చూడు బావా! ముందు పదేళ్ళంది. తర్వాత యెనిమిదేళ్ళంది. ఇప్పుడు ఆరేళ్ళంటోంది. ఆరేళ్ళా గాలా బావా?"

"పోనీ నాలుగేళ్ళు చేసుకో విమలా" అన్నాడు బుచ్చిబాబు రాజీ ప్రయత్నంగా.

"వీల్లేదు నాలుగేళ్ళలో చదువూ, ఉద్యోగం ఎక్క డవుతాయి?" అంది విమల కఠినంగా.

"ఆలశ్యంవైతే అతనిలో యేమన్నా మార్పొస్తుం దని భయమా నిర్మలా నీకు?" అని బుచ్చిబాబు గంభీరంగానే అడిగాడు.

"ఛీ ఛీ! అలాంటి భయంలేదు నాకు. వసంత్

అనితరసాధ్యుడు!"

"ఏడిశావ్‌లే, మూడునెల్ల ప్రేమకే అనితరసాధ్యుడయ్యాడు!" అని తిట్టింది విమల.

"విమల మాటలకేంగానీ .... నిర్మలా! ఇలా చూడు, ఆరేళ్ళెందుగ్గానీ .... రెండేళ్ళాగు. ఏం? అప్పటికి నీకు మైనారిటీ కూడా తీరుతుంది డిగ్రీ పూర్తి అవుతుంది."

"బుచ్చిబాబు మాటలకేంగానీ .... ఒసే నిర్మలా! ఇలా చూడు! అతని మాటలు వింటే సర్వనాశనమై పోతావు. నీకింకా కొన్ని పాఠాలు చెప్పాలి రాసుకో! కాయితం తెచ్చుకో!"

బుచ్చిబాబు వెటకారంగా నవ్వాడు — "నీ పాఠాలు వింటే ఇక చెల్లెలు బాగుపడ్డట్టే."

"బుచ్చిబాబు మొహం చూస్తావేమే! కాయితం తెచ్చుకో."

నిర్మల ఏడుపు మొహంతో కాయితం, పెన్నూ తెచ్చుకుంది — "ఊఁ చెప్పు .... తెచ్చుకున్నాలే."

"వాడికి .... అంటే, నీ చిన్నబ్బాయికి, తలకాయ ఉందా, లేదా? ఉంటే దాన్ని ఉపయోగిస్తాడా, లేదా? లేక, తాతగారి తలకాయ మీద ఆధారపడతాడా?

'కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు. తండ్రిగారి, తాతగారి భావాలకు దాసులు' అనేపాట వాడికి కంఠతా వొచ్చా, రాదా? రాకపోతే నేర్చుకుంటాడా, లేదా? నేర్చుకుంటే ఎప్పుడు నేర్చుకుంటాడు?

'వేయి పడగలు' చదివాడా, లేదా? చదివేప్పుడు దాన్ని విసిరికొట్టాడా, లేదా? విసిరికొడితే ఎన్నిసార్లు విసిరికొట్టాడు? ఏయే పేజీలు, చదువుతూ విసిరికొట్టాడు? పుస్తకం మళ్ళీ పనికిరాకుండా విసిరికొట్టాడా, లేదా? విసిరికొట్టకపోతే ఎందుకు విసిరికొట్టలేదు? ఏమిటి వాడి వుద్దేశం?

పెళ్ళయిన పూటనించీ మంగళగౌరీ నోములు నోచమని కాల్చుకు తినకుండా వుంటాడా, వుండడా? ఉంటే ఎందుకు వుంటాడు? ఉండకపోతే...."

బుచ్చిబాబు నిర్మలకి పారిపొమ్మని సైగచేశాడు. ఆ సపోర్టుతో నిర్మల రాయడం మానేసి — "నేనింక రాయనే! ఈ ప్రశ్నలన్నీ పార్వతి దేవదాసు నడిగిందా? లైలా, మజ్నూ నడిగిందా? రోమియో, జూలియట్ నడిగిందా?" అని తీవ్రంగా ఎదురు తిరిగింది.

"రోమియో ఆడది కాదే, జూలియట్టే ఆడది. వాళ్ళంతా సంసారాలు చెయ్యదల్చుకున్న వాళ్ళు కారే పిచ్చి మొద్దూ! కలిసి బతకదల్చుకున్న వాళ్ళు ఈ ప్రశ్నలన్నీ అడుక్కోవాలి. వాడి భావాలు ఇదీ, దీని భావాలు వాడూ తెలుసుకోవాలి. లేకపోతే, ఆ కాపరం ఏడిసినట్టు తయారవుతుందే. రెండు పెద్ద కీటకాలూ, కాసిన్ని పిల్ల కీటకాలూ బతికే మురిగ్గుంటలా తయారవుతుంది. తెలుసా?"

నిర్మల, బుచ్చిబాబు వేపు దీనంగా "చూడు బావా!" అన్నట్టు చూసింది.

బుచ్చిబాబు ఓదార్పుగా "విమల చెపుతున్నవన్నీ మంచి మాటలేగా నిర్మలా? కొంచెం వినెయ్యరాదూ? నీకే మంచిదిగా?" అని నచ్చచెపుతూ చూశాడు.

అంతలో దేవుళ్ళాగా చిన్నబ్బాయి వొచ్చాడు. కడిగిన ముత్యంలాగ అందరికీ ముద్దొచ్చే లాగ వున్నాడతను, నున్నగా తలదువ్వుకుని.

నిర్మల బైటికి పరిగెత్తి సిగ్గుతో మెలికలు తిరుగుతోన్న చిన్నబ్బాయిని చెయ్యి పట్టుకుని లోపలికి లాక్కొచ్చింది.

విమల ఉపన్యసించే మూడ్‌లో పడిపోయి "ఇద్దరూ కూర్చోండి. క్లాసు తీసుకుంటాను" అంది.

బుచ్చిబాబు "మనందరికీ గారెలు వొండి తెస్తాలెండి. నాకు చెయ్యడం వొచ్చు" అని లేచాడు.

నిర్మల కెవ్వున అరిచి "అమ్మో, అంత సేపా మాకు క్లాసు? గారెలూ బూరెలూ వొద్దు మాకు, 'ప్మా' చాలు, 'ప్మా' చాలు" అని గోల పెట్టింది.

"సరే, అలాగే" అంటూ బుచ్చిబాబు వంటింట్లోకి జారుకున్నాడు.

విమల పాఠం ప్రారంభించింది.

"వినండి! గుసగుసలాడుకోవద్దు! ప్రేమ, అమూల్యమైనది. మహత్తరమైనది. దాన్ని ఎలా కాపాడుకోవాలో తెలీక పట్టుమని పది రోజులైనా గడవకముందే ప్రేమని సర్వనాశనం చేసేసుకుంటారు. మురుగు నీటిలో ఆరోగ్యాలు నాశనమై పోయేటట్టు, మురుగు భావాల్లో ప్రేమ క్షీణించిపోతుంది.

అభ్యుదయ భావాల పునాది మీద ఆధారపడకపోతే ప్రేమలత జానెడెత్తుకే చీడపట్టి మాడిపోతుంది. ప్రేమ లత ఏపుగా పెరగాలంటే, ఇద్దరికీ ఆర్థిక స్వాతంత్ర్యం అనే ఆహారం అవసరం. లేకపోతే ...."

నిర్మల అడ్డొచ్చింది "నీకు వుందా ఆర్థిక స్వాతంత్ర్యం?"

"నేనేనా నీకు ఆదర్శం? నాకు ఆర్థిక స్వాతంత్ర్యం లేనందుకు నేనెంత సిగ్గుపడుతున్నానో నీకేం తెలుసు? నా కన్నా మంచి స్థితిలో వుండాలి నువ్వు. వసంత్! నువ్వుకూడా వింటున్నావా?"

వసంత్ వినయంగా "వింటున్నానండీ!" అన్నాడు.

"ఎవరి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వాళ్ళకి లేకుండా జీవితాలు సాగిస్తే .... అలాంటి ప్రేమ రాను రానూ బానిసత్వంలోకి జారిపోతుంది. మీ కలలన్నీ కల్లలవు తాయి. మీ ఆశలన్నీ నిరాశలవుతాయి. మీ అనురాగ మంతా విరాగమవుతుంది ..... అభ్యుదయ భావాల మీద ఆధారపడకపోతే మీ ప్రేమ వికలమై, ధ్వంసమై, నాశనమైపోతుంది. ప్రేమలతకి స్వేచ్ఛా స్వాంతత్ర్యాలే ఆహారం. స్త్రీని గుర్తించని దాంపత్యంలో ప్రేమ సంపూ ర్ణంగా నాశనమైపోతుంది. సంపూర్ణంగా, సంపూ ర్ణంగా...."

విమల్ని ప్రేమ దేవత ఆవేసించింది — "తొందర పడకండి! తొందర పడకండి! ప్రేమని ఆజన్మాంతం బతికించుకోండి! ప్రేమని ...."

శ్రోతలిద్దరూ ఆగలేక విమల ముందు మోక రిల్లారు.

"విమలా! విమలా! భయమేస్తోందే! మామూ లుగా మాట్లాడవే!"

"విమల గారూ! నీలూకి భయమేస్తోందండీ!"

"విమలా! నువ్వన్నదంతా వొప్పేసుకుంటామే! మమ్మల్ని వొదిలిపెట్టవే!"

"తొందరపడం విమలగారూ! అరవై ఏళ్ళదాకా పెళ్ళి మాటెత్తం!"

"చదువుతూ, ఉద్యోగాలూ, రిటైర్‌మెంట్లూ అన్నీ అయిపోయేదాకా ఒకర్ని ఒకరం చూసుకోమే. వొట్టు! పలకరించుకోమే! ఉపన్యాసం మానెయ్యవే!"

బుచ్చిబాబు వంటింట్లోంచి పరిగెత్తుకొచ్చాడు.

"విమలా! పిల్లలు జడుసుకుంటున్నారు. పాపం 'పెళ్ళి చేసుకోం' అని ఒట్లు కూడా పెట్టేసుకున్నారు. ఇంక మానేద్దూ?"

విమల "తొందరపడకండి! ప్రేమని ధ్వంసం చేసుకోకండి ...." అంటూ, కంఠం అంతా ధ్వంసం చేసుకుని నెమ్మదిగా "మంచినీళ్ళు! మంచినీళ్ళు! కంఠం పొడారి పోతోంది" అని సొమ్మసిల్లిపోయింది.

పిల్లలిద్దరూ ఇటూ అటూ పరుగులెత్తి రెండు చెంబుల్తో మంచినీళ్ళు పట్టుకొచ్చారు.

విమల రెండు చెంబులూ తాగేసి "చెప్పిందంతా అర్థమైందా? మళ్ళీ ఒకసారి చెప్పనా!" అంది.

పిల్లలు హాహాకారాలు చేశారు.

"వొద్దే! అర్థమైందే! వొట్టు!"

"బాగా అర్థమైందండీ!"

"వసంత్! నీకేం అర్థమైందో కొంచెం చెప్పు!"

నిర్మల వసంత్‌కేసి జాలిగా చూసింది.

వసంత్ ధైర్యంగా ముందుకొచ్చి కాళ్ళు దగ్గిరికి పెట్టుకుని, చేతులు కట్టుకుని గడగడా వేమన పద్యం అంత తేలిగ్గా పాఠం అప్పజెప్పేశాడు — "మీరు, ప్రేమ అమూల్యమైందని చెప్పారు. స్త్రీలను గుర్తించే అభ్యుదయ భావాల వల్లనే ప్రేమ నిలుస్తుందని చెప్పారు. ముదుగు భావాలతో ప్రేమలత ఎదుగూ బొదుగూ లేకుండా నాశనమైపోతుందని చెప్పారు. ఇంకానేమో .... మరేమో .... ప్రేమని జాగ్రత్తగా నిలుపు కోవాలని చెప్పారు ...."

"చాలు! చెప్పింది అర్థంచేసుకున్నావు వసంత్!"

"బాగా చెప్పానాండీ?"

"చాలు, బాగా చెప్పావు. నీకు బహుమతిగా మీ ఇద్దరికీ ఇప్పుడే దండల పెళ్ళి చేసేస్తేనో? — అని పిస్తోంది" అంది విమల మెచ్చుకుంటూ.

నిర్మల, విమల మీదకి ఎగబడి "విమలా, విమలా! అలా చెయ్యవే, నీకు పుణ్యం వుంటుంది. నీ ఫోటో పెట్టుకుంటామే! పెళ్ళయి పోయాక కూడా బుద్ధిగా చదువుకుంటామే!" అంటూ విమల గడ్డం పట్టుకుంది.

"పెళ్ళో పెళ్ళో అని అలా చచ్చిపోతున్నావేమిటే? అసలు మీ ఇద్దరికీ పెళ్ళి ఎప్పుడో అయిపోయింది, మీకు తెలీదా?" అంది విమల గంభీరంగా.

"మాకు పెళ్ళయిపోయిందా!"

"అయిపోయింది. ఇద్దరిదీ ఒకే బతుకుగా కలిసి జీవించాలనే ప్రేమ కలిగిందంటే, అది పెళ్ళయి పోయి నట్టే! ప్రేమేపెళ్ళి! అసలు పెళ్ళి అదే! బాజాలూ మంత్రాలూ అన్నీ నలుగురికీ తెలియడానికి."

ప్రేమికుల ముఖాలు ఆశ్చర్యంతో, ఆనందంతో విప్పారాయి. నిర్మల వసంత్‌ని నవ్వుతూ చూసి — "అవును వసంత్! మామిడి చెట్టుకింద మాట్లాడుకున్న నాడే మనకు పెళ్ళయిపోయింది!" అంది.

"అవును నీలూ! మన పెళ్ళి మనమే చేసు కున్నాం."

"చాలా బాగా అన్నావు వసంత్!

అయితే, మీ పెళ్ళి ఇప్పుడే చేసెయ్యాలా?" అంది విమల నవ్వుతూ.

నిర్మల, "మా పెళ్ళి ఎప్పుడో అయిపోయింది మా మనసుల్లో. ఇంక నువ్వు చేసేదేమిటి? మంత్రాలూ తంత్రాలూ మాకేం అక్కర్లేదు" అని తలెగరేసింది.

వసంత నవ్వుతూ — "ఇద్దరికీ చదువులూ ఉద్యోగాలూ వుండాలి. ఇద్దరికీ ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలి. అవి లేకుండా పెళ్ళి చేసుకోడం తప్పని అర్థమైంది కదండీ! ఏం నీలూ, అంతేగా?" అన్నాడు నీలూతో ముద్దుగా.

"వసంత్ చాలా మంచి కుర్రాడు!" అని విమల వసంత్‌ని మళ్ళీ మెచ్చుకుంది.

బుచ్చిబాబు పరిగెత్తు కొచ్చి తను వండుకొచ్చిన పిండి పదార్థంతో అందర్నీ సేదదీర్చి ఆనందపెట్టాడు.

★ ★ ★

రైలు దగ్గిర, విమల్ని వసంత్ భయం భయంగా అడిగాడు "ఏవండీ, నేను నీలూకి ఉత్తరాలు రాయొచ్చాండీ?"

"రాయొచ్చా ఏవిటి? అసలు తప్పకుండా రాసు కోవాలి" అంది విమల.

"హమ్మ! బతికించావే. ఎక్కడ వొద్దంటావో అని జడుసుకుని చచ్చిపోతున్నాం" అంది నీలూ.

"ఏడిశావ్‌లే. వెధవ అర్థాలన్నీ తీస్తావు" అని తిట్టింది విమల.

★ ★ ★

వాళ్ళని రైలెక్కించి వొచ్చిన తర్వాత విమల నిరుత్సాహంగా కూర్చుని — "పెళ్ళికి ముందు కలిగే ప్రేమలో ఎంత మాధుర్యం వుందో! మనం పెళ్ళికి ముందు ఇంత మధురంగా మాట్లాడుకున్నామో లేదో ఇప్పుడు గుర్తేలేదు" అని విచారంలో మునిగి పోయింది.

"నేను మాత్రం నిన్ను ప్రేమించే పెళ్ళి చేసు కున్నాను" అన్నాడు బుచ్చిబాబు.

"అయితే మరి నాతో ఒక్కసారి కూడా ఎందుకు మాట్లాడలేదు?"

"నువ్వెప్పుడన్నా మాట్లాడనిస్తేనా?"

"మాట్లాడకుండా ప్రేమ ఏం ప్రేమ? నువ్వు నన్ను ప్రేమించావని నమ్మకం ఏమిటి?"

"ప్రేమించాను విమలా! నువ్వు పొడుగ్గా వుంటా వుగా? నువ్వు కాలేజీ నించి వొస్తోంటేనే నాకు తెలిసి పోయేది."

"నువ్వు ప్రేమించింది నన్నో, మా అక్కనో! అది నా కన్నా పొడుగు. నీ కసలు కళ్ళు సరిగ్గా కనపడవు."

"కాదులే, నిన్నే. మీ అక్క నాతో మాట్లాడుతూనే వుండేది. నువ్వే మాట్లాడకుండా తిరిగే దానివి. నిన్నొక్క దాన్నే ప్రేమించాను నేను, అప్పుడూ ఇప్పుడూ కూడా. అనవసరంగా బెంగ పడకు. నువ్వు కూడా నన్ను ప్రేమించావా?"

"ప్రేమించాను బుచ్చిబాబూ! కానీ, మాట్లాడాలని వుండేదిగానీ .... ఏమో ఎందుకు మాట్లాడలేదో! మనసులో ఎంత మాట్లాడే దాన్నో! ఎంత పిచ్చివాళ్ళమో కదూ?"

"పోనీలే, పోనీలే విమలా! మాట్లాడుకోపోయినా ప్రేమ వుందిగా? అప్పటికీ ఇప్పటికీ నా మనసులో నువ్వే!"

"అవును, నువ్వు అనితర సాధ్యుడివి!"

"అదేదో తిట్టులా వుంది నాకు. నిర్మల చెప్పిందిలే దాని అర్థం, కానీ, అల్లాంటి మాట లెందుకు చెప్పు? నేను అనితర సాధ్యుణ్ణయితే మరి నువ్వూ?" అంటూ బుచ్చిబాబు విమల చేతిని ముద్దుపెట్టుకున్నాడు నవ్వుతూ.

['ఆంధ్రజ్యోతి' వారపత్రికలో 26-12-1980 నించీ 4 వారాల వరకూ] ★